

చదువుతో పాటు క్రీడల్లో రాణించాలి

- ఎస్‌జీఎఫ్ జిల్లా కార్యదర్శి శారదాబాయి
- ఉమ్మడి జిల్లా చెస్, ఖోఖో, అథ్లెటిక్స్ జట్ల ఎంపిక

7

- 600 మంది క్రీడాకారులు హాజరు
- త్వరలో నిర్వహించనున్న రాష్ట్ర స్థాయి పోటీలు

అమ్మో చిరుత

- నారాయణపేట జిల్లాలో భయపెడుతున్న చిరుత పులుల సంచారం
- ఇదివరకే ఎక్లాస్‌పూర్ ఎకో పార్కు దగ్గర సీసీ కెమెరాల్లో కనిపించిన చిరుత
- తాజాగా మద్దూర్ మండలం పెద్రిపహాడ్ వద్ద కనిపించిన రెండు మృగాలు
- ఆందోళనలో రైతులు, కాపర్లు
- గత ఏడాది నుంచి ఇప్పటి వరకు 54 పశువులు, గొర్రెలపై దాడి



మద్దూరు మండలం పెద్రిపహాడ్ గుట్టలపై కనిపించిన చిరుతలు(ఫైల్)

నారాయణపేట, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): నారాయణపేట జిల్లాలో గుట్టలు, వ్యవసాయ పొలాలకు సమీపంలో చిరుత పులులు సంచరిస్తుండటంతో ప్రజలు, రైతులు భయపడుతున్నారు. పొలాలకు వెళ్లే రైతులు, పశువులు, బర్రెలు, మేకలను కాసేందుకు అడవికి వెళ్లే కాపరులు జంకుతున్నారు. తాజాగా సోమవారం మద్దూర్ మండలం పెదరిపాడ్ తండా గుట్ట ప్రాంతాల్లో పెద్ద చిరుతతో పాటు చిన్న పిల్ల కనిపించడంతో తండా వాసులు హడలెత్తిపోయారు. జిల్లాలో 12 చిరుత పులులు, ఐదు చిన్న పిల్లలు ఉన్నాయని అధికారులు చెబుతున్నారు.



చిరుత కదలికలను గుర్తించేందుకు ఏర్పాటు చేసిన సీసీ కెమెరాను చూపుతున్న ఫారెస్టు అధికారులు

మండలాల్లోని అటవీ ప్రాంతాల్లో చిరుత సంచరిస్తూ వ్యవసాయ పొలాల వద్ద కట్టేసిన పశువులపైనా, మేతకు తీసుకెళ్లిన గొర్రెలపైనా దాడి చేసి చంపేస్తుందని రైతులు అంటున్నారు.

17 చిరుతలు

జిల్లాలోని అడవుల్లో 12 చిరుత పులులు, ఐదు చిన్న పిల్లలు మొత్తం 17 సంచరిస్తున్నట్లు అటవీ శాఖ అధికారులు అంచనా వేస్తున్నారు. గతంలో ధన్వాడ మండలం రాకొండ శివారులో చిరుతను అటవీ అధికారులు బోను ఏర్పాటు చేసి పట్టుకున్నారు.

2.33 లక్షల హెక్టార్లలో అడవులు

జిల్లా వ్యాప్తంగా 2.33 లక్షల హెక్టార్లలో అడవులు ఉన్నాయి. మినాస్‌పూర్, కోటకొండ రిజర్వు ఫారెస్టు బ్లాకులు ఉన్నాయి. జంతువుల కదలికలను గుర్తించేందుకు అటవీ శాఖ అధికారులు 19 సీసీ కెమెరాలను ఏర్పాటు చేశారు. ఇదివరకే ఎక్లాస్‌పూర్ ఎకో పార్కు దగ్గర చిరుత సంచరించినట్లు సీసీ కెమెరాలో రికార్డు అయ్యింది. ఎక్లాస్‌పూర్, కోటకొండ, మద్దూర్, లక్ష్మీపూర్, కొల్లంపల్లి అడవుల్లోనూ చిరుత సంచరిస్తోందని గ్రామస్థులు చెబుతున్నారు. దామరగిద్ద మండలం బాపన్‌పల్లి, ధన్వాడ మండలం కిష్టాపూర్, కొండాపూర్, మందిపల్లి తండా, రాంకిష్టయ్యపల్లి, మద్దూర్, పెదిరెపాడ్ తండా, గుండుమాల్, కొత్తపల్లి

ఏడాదిలో..

జిల్లాలో 2024 నుంచి ఇప్పటి వరకు చిరుత పులులు 54 పశువులు, బర్రెలు, గొర్రెలను చంపి తిన్నాయని అటవీశాఖ అధికారుల లెక్కలు చెబుతున్నాయి. దాంతో బాధితులు 16.24 లక్షలు నష్టపోయారు. ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపగా, రూ.3 లక్షల వరకు బాధిత రైతులకు నష్టపరిహారం చెక్కులను అందించారు.

రైతులు జాగ్రత్తగా ఉండాలి

జిల్లాలోని మద్దూర్, గుండుమాల్, కొత్తపల్లి, కోటకొండ, ఎక్లాస్‌పూర్, కర్ణాటక సరిహద్దు తదితర అటవి ప్రాంతాల్లో 12 చిరుత పులులు, ఐదు చిన్నవి ఉన్నాయి. రైతులు పశువులను పొలాల వద్ద కాకుండా ఇళ్ల వద్ద కట్టేసుకోవాలి. రాత్రి వేళ ఒంటరిగా పొలాల వద్దకు వెళ్లొద్దు. పులులు కనిపిస్తే సమాచారం ఇవ్వాలి. బోన్లు ఏర్పాటు చేసి పట్టుకుంటాం. ఇప్పటికే జిల్లాలో పలు చోట్ల బోన్లు ఏర్పాటు చేశాం.

- కమాలొద్దీన్, ఫారెస్ట్ అసిస్టెంట్ రేంజ్ ఆఫీసర్, నారాయణపేట

లేబర్ కార్డుతో ఆర్థిక భరోసా

- పిల్లల చదువులకు ఉపకార వేతనం
- గృహ నిర్మాణానికి సాయం.. ● చనిపోతే బీమా
- 'ఆంధ్రజ్యోతి'తో నారాయణపేట జిల్లా కార్మిక శాఖ అధికారి మహేశ్ కుమార్

ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూ

నారాయణపేట టౌన్ నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): పని చేస్తేనే పూట గడిచే భవన నిర్మాణ కార్మికులకు లేబర్ కార్డుతో ఆర్థిక భరోసా లభిస్తుందంటున్నారు నారాయణపేట జిల్లా కార్మిక శాఖ అధికారి మహేశ్ కుమార్. వారితో పాటు సెంట్రింగ్, ప్లంబర్, ఫ్లోరింగ్, పెంటింగ్, కరెంట్ పనులు చేసే కార్మికులకు కూడా దీని వల్ల లబ్ధి చేకూరుతుందని చెబుతున్నారు. బుధవారం ఆయన 'ఆంధ్రజ్యోతి'తో మాట్లాడారు. ఆ వివరాలు..

లేబర్ కార్డు అంటే ఏంటి?

లేబర్ కార్డు అనేది కార్మికుల గుర్తింపు పత్రం. ఈ కార్డు ఉంటే ప్రభుత్వ పథకాల్లో కార్మికులు నేరుగా లబ్ధి పొందుతారు. కుటుంబం భవిష్యత్తు, భద్రత కోసం లేబర్ కార్డు తప్పనిసరిగా తీసుకోవాలి.



ఆంధ్రజ్యోతితో మాట్లాడుతున్న మహేశ్ కుమార్

లేబర్ కార్డులతో ఎలాంటి ప్రయోజనాలు లభిస్తాయి?

వైద్య సాయం అందుతుంది. పిల్లల చదువుకు ఉపకార వేతనాలు, గృహ నిర్మాణానికి సాయం అందుతుంది. ప్రసూతి ప్రయోజనాలు అందుతాయి. ప్రమాద బీమా లభిస్తుంది. చనిపోతే ఆర్థిక సాయం వస్తుంది.

ఈ కార్డు పొందేందుకు ఎవరు అర్హులు?

లేబర్ కార్డు పొందేందుకు నిర్మాణ పనులు చేసేవారు అర్హులు. వారితో పాటు మేస్త్రీలు, డ్రైవర్, ఎలక్ట్రీషియన్, పెయింటర్, ప్లంబర్, టైలర్, వెల్డర్ వంటి వృత్తులు చేసే వారు కూడా అర్హులే. 18 నుంచి 60 ఏళ్ల వయస్సు ఉన్న వారు, ఏడాదిలో కనీసం 90 రోజులు పనులు చేసిన వారు దరఖాస్తు చేసుకోవచ్చు.

ఎలా దరఖాస్తు చేసుకోవాలి?

కార్మికుడి ఆధార్ కార్డు, నామిని ఆధార్ కార్డు, రేషన్ కార్డు, రెండు ఫొటోలు బ్యాంక్ అకౌంట్‌తో మీసేవ కేంద్రంలో దరఖాస్తు చేసుకోవాలి. దరఖాస్తు పత్రాలను లేబర్ కార్యాలయంలో సమర్పించాలి. వాటిని పరిశీలించిన తర్వాత కార్మికుడికి కార్డు జారీ చేస్తాము.

జిల్లాలో ఎందరికి ప్రయోజనం చేకూరింది?

జిల్లాలో ఇప్పటి వరకు దాదాపు 66 వేల మంది కార్మికులకు లేబర్ కార్డులు ఇచ్చాము. వారికి వివిధ పథకాల కింద గత ఏడాది రూ.13,37,13,240 మంజూరయ్యాయి. కొత్తగా పెళ్లి చేసుకున్న వారికి, ప్రసూతి సాయం, సహజ మరణాలు, ప్రమాద మృతుల కుటుంబాలకు వీటిని అందజేశాం.



కురుమూర్తిలో వేంకటేశ్వరస్వామిని దర్శించుకుంటున్న అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్, మంత్రి వాకిటి శ్రీహరి, ఎమ్మెల్యేలు మధుసూదన్‌రెడ్డి, యెన్నం శ్రీనివాస్‌రెడ్డి, మేఘారెడ్డి

కురుమూర్తిస్వామిని దర్శించుకున్న
స్పీకర్ గడ్డం ప్రసాద్

చిన్నచింతకుంట, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి) : పేదల తిరుపతిగా పేరొందిన కురుమూర్తి వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాల సందర్భంగా బుధవారం సాయంత్రం తెలంగాణ శాసనసభా స్పీకర్ గడ్డం ప్రసాద్ స్వామివారిని దర్శించుకున్నారు. ఆలయం వద్దకు చేరుకోగానే రాష్ట్ర పశుసంవర్ధక, క్రీడల శాఖా మంత్రి వాకిటి శ్రీహరి, దేవరకద్ర ఎమ్మెల్యే జి మధుసూదన్‌రెడ్డి, మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి, వనపర్తి ఎమ్మెల్యే మేఘారెడ్డి, ఆలయ ఈఓ మదనేశ్వర్‌రెడ్డి, పాలకవర్గం సభ్యులు ఘనస్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు పూర్ణకుంభం, మేళతాలాలతో ఘన స్వాగతం పలికారు. అనంతరం స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.. ఆలయ విశిష్టతను అర్చకులు వివరించారు. అర్చకులు ఆలయ ప్రాంగణంలో స్పీకర్‌తో పాటు మంత్రి, ఎమ్మెల్యేలను ఘనంగా సత్కరించి ఆశీర్వదించారు. ఈ సందర్భంగా స్పీకర్ మాట్లాడుతూ ప్రజలకు ప్రభుత్వం ఇచ్చిన హామీలకు ఒక్కొక్కటిగా నెరవేరుస్తుందని, ఈ ప్రభుత్వానికి స్వామి వారి ఆశీర్వాదాలు ఉండాలని కోరారు. మరో ఐదేళ్ళు ఈ ప్రభుత్వం అధికారంలో ఉండాలని స్వామివారు దీవించాలని, ప్రజలంతా సుభిక్షంగా ఉండాలని స్వామివారిని కోరినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు అరవింద్‌కుమార్‌రెడ్డి, సింగిల్‌విండో చైర్మన్ సురేందర్‌రెడ్డి, ఉమామహేశ్వర్‌రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్‌లు కతలప్ప, ప్రశాంత్, కాంగ్రెస్ నేతలు నరేందర్‌రెడ్డి, పట్టెం శివకుమార్ పాల్గొన్నారు. జిల్లా ఎస్పీ జానకి, డీఎస్పీ వెంకటేశ్వర్లు బందోబస్తును పర్యవేక్షించారు.

ఇంటి తాళం విరగ్గొట్టి
బంగారం, వెండి చోరీ

- నారాయణపేట ఎస్పీ గెస్ట్ హౌస్ పక్కనే సంఘటన
- పోలీసులకు ఫిర్యాదు

7

భూ మాయ

- రేకులకుంట శిఖం భూమి అక్రమ రిజిస్ట్రేషన్
- ఈ అంశంపై గతంలో 'ఆంధ్రజ్యోతి' కథనం
- సర్వే చేసి కలెక్టర్‌కు నివేదిక ఇచ్చిన అధికారులు

6

- అయినా ప్రైవేటు వ్యక్తులకు ఎకరం రిజిస్ట్రేషన్

బాలికకు వేధింపులు

- వ్యక్తికి దేహశుద్ధి, పోలీసులకు అప్పగింత
- నారాయణపేట జిల్లా కేంద్రంలో ఘటన

6

లారీని ఢీకొన్న ఆర్టీసీ బస్సు

6

- పలువురికి గాయాలు
- జేపీఎన్‌సీఈ సమీపంలో ఘటన



ఆందోళనకారులతో మాట్లాడుతున్న పోలీసులు

బాధిత కుటుంబాన్ని
ఆదుకోవాలని రాస్తారోకో

- 2 గంటల పాటు నిలిచిన వాహనాలు

కోయిలకొండ, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): కోయిలకొండ మండలం దమాయపల్లి వద్ద కారు ఢీకొని మృతి చెందిన ముత్యాలమ్మ, బాల్‌రామ్ కుటుంబాన్ని ఆదుకోవాలని దళిత సంఘాల ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని చౌరస్తాలో బుధవారం రాస్తారోకో చేశారు. మృతుడి భార్య, పిల్లలతో రోడ్డుపై కూర్చుని నిరసన తెలిపారు. పోలీసులు కారు డ్రైవర్‌కు అనుకూలంగా వ్యవహరిస్తున్నారని నినాదాలు చేశారు. దాదాపు రెండు గంటల పాటు ఆందోళన చేయడంతో ఎక్కడి వాహనాలు అక్కడ నిలిచిపోయాయి. ఎస్‌ఐ తిరుపాజీ జిల్లా పోలీసులకు సమాచారం ఇవ్వడంతో సీఐ గాంధీనాయక్ తోపాటు పలువురు ఎస్‌ఐలు అక్కడికి వచ్చారు. ఆందోళనకారులకు సర్దిచెప్పే ప్రయత్నం చేశారు. అయినా శాంతించ లేదు. దాంతో బాధత కుటుంబాన్ని న్యాయం చేస్తామని భరోసా ఇవ్వడంతో ఆందోళన విరమించారు. కారు డ్రైవర్ నరేష్‌పై కఠిన చర్యలు తీసుకోవాలని దళిత సంఘాల నాయకులు కోరారు



రాస్తారోకోతో నిలిచిన వాహనాలు

- ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి
- ఆకట్టుకున్న జానపద నృత్య ప్రదర్శనలు
- పోటీల్లో పాల్గొన్న 350 మంది విద్యార్థులు, యువత

యువజన ఉత్సవాలతో..
వెలుగులోకి ప్రతిభ



నృత్యం చేస్తున్న బాలికలు

మహబూబ్‌నగర్ స్పోర్ట్స్ నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): ప్రతిభను వెలికి తీసేందుకు జిల్లా యువజన సాంస్కృతిక పోటీలు నిర్వహిస్తున్నట్లు మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి చెప్పారు. స్వామి వివేకానంద జన్మదిన సందర్భంగా బుధవారం జిల్లా యువజన, క్రీడల శాఖ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని మల్టీపర్పస్ ఇండోర్ స్టేడియంలో జిల్లా స్థాయి యువజన ఉత్సవాలను నిర్వహించారు. మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై, జ్యోతి ప్రజ్వలన చేసి పోటీలను ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఇలాంటి సాంస్కృతిక పోటీలతో విద్యార్థులు, యువతలో దాగున్న ప్రతిభను వెలికి తీయొచ్చని అన్నారు. కళలను ప్రోత్సహించడం ద్వారా యువతకు మరింత అవకాశం లభిస్తుందన్నారు. సైన్స్ ఎగ్జిబిషన్ కూడా ఏర్పాటు చేశారు. జిల్లా వ్యాప్తంగా దాదాపు 350 మంది విద్యార్థులు, యువత పాల్గొన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర మైనారిటీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ ఒబేదుల్లా కొత్వాల్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మల్లు నర్సింహరెడ్డి, డీసీసీ ప్రధాన కార్యదర్శి సిరాజ్‌ఖాద్రీ, జిల్లా ఒలింపిక్ సంఘం ప్రధాన కార్యదర్శి కురుమూర్తిగౌడ్, డీవైఎస్‌వో శ్రీనివాస్, సూపరిటెండెంట్ రాజగోపాల్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి

విజేతలు వీరే..

జిల్లా స్థాయి సాంస్కృతిక పోటీల్లో విద్యార్థులు, యువత నైపుణ్యాన్ని ప్రదర్శించారు. జానపద నృత్యం గ్రూప్‌లో మహబూబ్‌నగర్ చంద్రముకి కల్చరర్ అకాడమీ ప్రథమ స్థానంలో నిలిచి, రాష్ట్ర స్థాయికి ఎంపికైంది. జానపద గీతాల గ్రూప్‌లో శివరాణి గ్రూప్(నంచర్ల మహబూబ్‌నగర్), వ్యాస రచనలో నిఖిత(రామచంద్రపూర్, మహబూబ్‌నగర్), పెయింటింగ్‌లో సింధూజ(అమిస్తాపూర్), ఉపన్యాసంలో రబియ సుల్తాన(మహబూబ్‌నగర్), కవిత్వంలో భార్గవి(ఎంజేపీటీ, భూతూరు), సైన్స్‌లో లావణ్య గ్రూప్ (గురుకుల డిగ్రీ కళాశాల, పిల్లలమర్రి) మొదటి స్థానంలో నిలిచి, రాష్ట్ర స్థాయికి ఎంపికయ్యారు.



కత్తి దూస్తున్న బాలిక



సైబర్ నేరాల పట్ల జాగ్రత్తగా ఉండాలి

- నారాయణపేట ఎస్పీ వినీత్

నారాయణపేట, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): మాయమాటలతో మభ్యపెట్టి, కొత్తకొత్త టెక్నిక్‌లతో సైబర్ నేరగాళ్లు మార్కెట్లోకి వస్తున్నారని, ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలని నారాయణపేట ఎస్పీ డాక్టర్ వినీత్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. సైబర్ నేరాల బారిన పడి నష్టాలను కొని తెచ్చుకోవద్దని పేర్కొన్నారు. ఒకవేళ మోసపోతే వెంటనే 1930 టోల్‌ఫ్రీ నెంబర్‌కు పూర్తి వివరాలతో ఫిర్యాదు చేయాలని సూచించారు. జిల్లాలో జరుగుతున్న సైబర్ నేరాలపై సైబర్ వారియర్స్ ద్వారా ప్రజలకు అవగాహన కల్పిస్తున్నామని తెలిపారు.

కుక్కను తప్పించబోయి
స్కూల్ బస్సు బోల్తా

- స్వల్ప గాయాలతో బయటపడ్డ విద్యార్థులు

6

కొవిడ్ బాధిత పిల్లలను
జాగ్రత్తగా చూసుకోవాలి

- పీఎం కేర్‌లో ఉన్న చిల్డ్రన్స్‌పై 'పేట' కలెక్టర్ సమీక్ష

నారాయణపేట, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): కొవిడ్ కారణంగా తల్లిదండ్రులు చనిపోయి, అనాథలైన పిల్లలను జాగ్రత్తగా చూసుకోవాలని నారాయణపేట కలెక్టర్ విజయేందిర బోయి చెప్పారు. ఆ పిల్లలకు సంబంధించి ప్రతీ మూడు నెలలకు ఒకసారి నిర్వహించే సమీక్షలో భాగంగా కలెక్టర్ బుధవారం కలెక్టరేట్‌లోని తన ఛాంబర్‌లో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ సంచిత్ గంగ్వార్‌తో కలిసి సమీక్ష చేశారు. జిల్లాలో పీఎం కేర్‌లో ఉన్న ఇద్దరు పిల్లలను కలెక్టరేట్‌కు పిలిపించి, ఆరోగ్యం, విద్య, రక్షణ అంశాలపై అడిగి తెలుసుకున్నారు. వారి యోగక్షేమాలపై ఆరా తీశారు. ఏమైనా సమస్యలు ఉన్నాయా? ప్రస్తుతం ఏం చదువుతున్నారు? అని అడిగారు. చదువుపై వారికి ఉన్న ఆసక్తిని గమనించారు. పీఎం కేర్స్ కింద పిల్లలకు వస్తున్న బెనిఫిట్స్‌కు సంబంధించి పోస్టాఫీసులో కలెక్టర్, చైల్డ్ పేర్లపై ఉన్న ఉమ్మడి ఖాతాలను ఒకసారి చెక్ చేయాలని, పిల్లల తండ్రి పేరు మీద ఉన్న పట్టా భూమి వారిపేర్లపై పట్టా అయ్యేలా చూడాలని డీసీపీవోను ఆదేశించారు. స్పాన్సర్‌షిప్ ఇచ్చే అవకాశాలు ఉంటే పరిశీలించాలని, పిల్లల రక్షణను ఫాలో చేస్తూ స్టేటస్‌ను అప్‌డేట్ చేయాలని చెప్పారు.



కొవిడ్ బాధిత బాలికతో మాట్లాడుతున్న కలెక్టర్ సిక్తా పట్నాయక్



ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలి

- మహబూబ్‌నగర్ కలెక్టర్ విజయేందిర బోయి
- దివ్యాంగులు, వృద్ధుల సమస్యలపై ప్రత్యేక ప్రజావాణి

మహబూబ్‌నగర్ కలెక్టరేట్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): ప్రత్యేక ప్రజావాణి ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలని మహబూబ్‌నగర్ కలెక్టర్ విజయేందిర బోయి అధికారులను ఆదేశించారు. మహబూబ్‌నగర్ అర్బన్ తహసీల్దార్ కార్యాలయంలో బుధవారం దివ్యాంగులు, వృద్ధుల సమస్యలపై ప్రత్యేక ప్రజావాణి నిర్వహించారు. ఈ కార్యక్రమానికి 27 ఫిర్యాదులు వచ్చాయి. అదనపు కలెక్టర్ శివేంద్రప్రతాప్‌తో కలిసి కలెక్టర్ దివ్యాంగులు, వృద్ధుల సమస్యలను విని, ఫిర్యాదులను స్వీకరించారు. ఇచ్చిన ప్రతీ దరఖాస్తును నిర్లక్ష్యం చేయకుండా సంబంధిత శాఖల అధికారులు పరిశీలించి, చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.



ఓ దివ్యాంగుడి సమస్యను వింటున్న కలెక్టర్ విజయేందిర బోయి

అనంతరం అంతర్జాతీయ వయోవృద్ధుల దినోత్సవాన్ని పురస్కరించుకొని వారం రోజులు నిర్వహించే కార్యక్రమాల పోస్టర్‌ను కలెక్టర్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో జిల్లా సంక్షేమ అధికారి జరీనాబేగం, మునిసిపల్ కమిషనర్ ప్రవీణ్‌కుమార్‌రెడ్డి, డిప్యూటీ తహసీల్దార్ దేవేందర్ కేశిరెడ్డి, సీనియర్ సిటిజన్ ఫోరం అధ్యక్షుడు జగపతిరావు, నాగభూషణం, రాజసింహుడు, శివన్న, అంజయ్యచారి, పాండురంగం, నాగేంద్రస్వామి పాల్గొన్నారు.

భవిష్యత్ తరాలకు పరిశోధనా ఫలాలు

» పీయూ వీసీ ప్రొఫెసర్ జీఎన్ శ్రీనివాస్



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న పీయూ వీసీ ప్రొఫెసర్ జీఎన్ శ్రీనివాస్, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ పూస రమేష్‌బాబు, అధికారులు

పాలమూరు యూనివర్సిటీ, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి) : పరిశోధనా ఫలా లను భవిష్యత్ తరాలకు అందించాలని పీయూ వీసీ ప్రొఫెసర్ జీఎన్ శ్రీనివా స్ అన్నారు. పాలమూరు యూనివర్సిటీ జంతుశాస్త్ర విభాగం అధ్యాపకురాలు అర్.లక్ష్మి రచించిన 'బయోడైవర్సిటీ ప్రిన్సిపుల్స్ అండ్ ప్రాక్టీసెస్' అనే పుస్తకాన్ని బుధవారం రిజిస్ట్రార్ ప్రొఫెసర్ పూస రమేశ్‌బాబుతో కలిసి ఆవిష్కరించారు. కార్యక్రమంలో పరీక్షల నియంత్రణ అధికారి డాక్టర్ ప్రవీణ, అకాడమిక్ ఆడి ట్ సెల్ డైరెక్టర్ డాక్టర్ చంద్రకిర ణ్, అధ్యపకులు పాల్గొన్నారు.

లా సీట్లను భర్తీ చేయాలి

» విద్యార్థి సంఘాల నాయకుల డిమాండ్



పీయూ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ పూస రమేష్‌బాబుకు వినతి పత్రం అందజేస్తున్న విద్యార్థి నాయకులు

పాలమూరు యూనివర్సిటీ, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి) : పాలమూరు యూనివర్సిటీలోని లా కోర్సులో మిగిలిన సీట్లను స్పాట్ అడ్మిషన్స్ ద్వారా తక్షణమే భర్తీ చేయాలని విద్యార్థి సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం వారు పీయూ పరిపాలన భవనంలోని చాంబర్‌లో రిజిస్ట్రార్ ప్రొఫెసర్ పూస రమేశ్‌బాబుకు వినతి పత్రం ఇచ్చారు. కార్యక్రమంలో నాయకులు సందె కార్తీక్, బత్తిని రాము, మారుతి, భరత్, కమలాకర్ తదితరులు పాల్గొన్నారు.

విజేతలకు బహుమతుల ప్రదానం



వాలీబాల్ విజేత టీంకు బహుమతి అందచేస్తున్న నాయకులు

గట్టు, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో భవానీ మాత జాతర సందర్భంగా నిర్వహించిన జిల్లా స్థాయి కబడ్డీ పోటీలు బుధవారం ముగిశాయి. మొదటి విజేతగా మేడికొండ జడ్పీహెచ్ఎస్ టీం విజేతగా నిలువగా మాజీ సర్పంచ్ ధనలక్ష్మి రూ. 20 వేలు అందచేశారు. పచ్చర్లటీం ద్వితీయ విజేతగా నిలువడంతో రూ. 15 వేలను మాజీ ఎంపీటీసీ అలేఖ్య అందచేశారు. మూడవ విజేతగా గట్టు హనుమాన్‌టీం విజేతగా నిలువడంతో 10 వేలను రిటైర్డ్ ఎంఈవో సత్యనారాయణ అందచేశారు. నాల్గువ విజేతగా వావిలాల టీం విజయం సాధించగా, రూ.5వేలను దేవన్న అందచేశారు. రిటైర్డ్ హెచ్ఎం గోవిందప్ప, కాంట్రాక్టర్ కృష్ణమూర్తి, శ్రీనాథ్, దేవన్న తదితరులు పాల్గొన్నారు.

వాలీబాల్ విజేత ఎల్కూర్

భవానీ మాత జాతర సందర్భంగా నిర్వహించిన వాలీబాల్ పోటీలు ముగిశాయి. ఎల్కూర్ టీం మొదటి విజేతగా నిలువడంతో రూ. 10వేలను దాత పి.రామకృష్ణారెడ్డి అందచేశారు. రెండవ విజేతగా చింతలకుంట టీంకు కే బాషా రూ.5 వేలను అందచేశారు. తృతీయ విజేత మల్లాపురం టీం నిలవడంతో గదగుండు నర్సప్ప రూ.3వేలను అందచేశారు. నాల్గువ విజేతగా జీజీ స్టార్స్ యూత్ ఐకాన్ టీం గెలవడంతో రూ .2వేలను దును వాగ్ధేవి జూనియర్ కళాశాల వారు అందచేశారు.

కుక్కను తప్పించబోయి స్కూల్‌బస్సు బోల్తా

దేవరకద్ర, నవంబరు 12 (ఆంధజ్యోతి) : అడ్డుగా వచ్చిన కుక్కను తప్పించబోయి స్కూలుబస్సు బోల్తాపడింది. మహబూబ్‌నగర్ జిల్లా, దేవరకద్ర మండల పరిధిలోని బల్సుపల్లి శివారులో బుధవారం ఈ సంఘటన జరిగింది. మండల కేంద్రానికి చెందిన విద్యజ్యోతి స్కూల్ బస్సు కోయిల్‌సాగర్, నాగారం, పెద్దరాజమూరు గ్రామాల నుంచి విద్యార్థులను ఎక్కించుకొని వస్తోంది. బల్సుపల్లి వద్ద ముందు వెళ్తున్న లారీని ఓవర్‌టేక్ చేస్తుండగా ఎదురుగా వచ్చిన కుక్కను తప్పించ బోయి అదుపుతప్పి బోల్తాపడింది. బస్సులోని విద్యార్థులు స్వల్పగాయాలతో బయటపడటంతో తల్లిదండ్రులు ఊపిరి పీల్చుకున్నారు.

10 క్వింటాళ్ల పత్తి దహనం

» నిప్పంటించిన గుర్తు తెలియని వ్యక్తులు



కాలిన పత్తిని పక్కకు తీస్తున్న బాధిత కుటుంబ సభ్యులు

చారకొండ, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి) : ఓ రైతు ఇంటి ముందు నిల్వ ఉంచుకున్న పత్తికి గుర్తు తెలియని వ్యక్తులు నిప్పంటించారు. నాగర్‌కర్నూల్ జిల్లా, చారకొండ మండలంలోని అగ్రహారం తండాకు చెందిన రైతు రైతు కొర్ర రాజునాయక్ తన ఇంటి ముందు దాదాపు 65 క్వింటాళ్ల పత్తిని నిల్వ చేసుకున్నాడు. అతడు బుధవారం ఉదయం పొలానికి వెళ్లి మధ్యాహ్నం తిరిగి వచ్చేలోగా గుర్తు తెలియని వ్యక్తులు పత్తికి నిప్పంటించారు. చుట్టుపక్కల వారి సాయంతో మంటలను ఆర్పేశాడు. అప్పటికే 10 క్వింటాళ్ల పత్తి కాలిబూడిదయ్యింది. దాదాపు లక్ష రూపాయల నష్టం వాటిల్లిందని, సంఘటనపై పోలీసులకు ఫిర్యాదు చేశానని బాధితుడు తెలిపారు.

పేకాటరాయుళ్ల అరెస్టు

వెల్దండ, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని కుప్పగండ్ల సమీపంలోని ఓ రైస్‌మిల్లు వెనుక పేకాట ఆడుతున్న ఆరుగురు వ్యక్తులను బుధవారం పోలీసులు అరెస్ట్ చేశారు. ఖచ్చితమైన సమాచారం మేరకు పోలీసులు పేకాట ఆడుతున్న వ్యక్తులను అదుపులోకి తీసుకుని వారివద్దనుండి 7790 రూపాయల నగదును స్వాధీనం చేసుకున్నారు. అనంతరం వారిని స్టేషన్‌కు తరలించి కేసునమోదు చేసినట్లు ఎస్ఐ కురుమూర్తి తెలిపారు.

అనుమానాస్పద స్థితిలో మహిళ మృతి

» పోలీసులకు ఫిర్యాదు చేసిన కుటుంబ సభ్యులు

అమ్రాబాద్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని బీకే లక్ష్మాపూర్ గ్రామానికి చెందిన ఆలూరి సంతోషి(31) అనే మహిళ అనుమానాస్పదంగా మృతి చెందింది. పదేళ్ల క్రితం భర్త అర్జున్‌తో కలిసి బతుకుదెరువు కోసం లక్ష్మాపూర్ నుంచి హైదరాబాద్ వెళ్లారు. కొన్ని రోజులుగా ఉస్మానియా ఆసుపత్రిలో చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందడంతో ఆ మహిళ మృతదేహాన్ని స్వగ్రామం లక్ష్మాపూర్‌కు బుధవారం తీసుకొచ్చారు. సంతోషి మృతిపై అనుమానాలు ఉన్నాయని ఆమె తండ్రి దాసరి శ్రీశైలం అమ్రాబాద్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఆమెకు భర్త, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

భూ మాయ

» రేకులకుంట శిఖం భూమి అక్రమ రిజిస్ట్రేషన్

» ఈ అంశంపై గతంలో 'ఆంధ్రజ్యోతి' కథనం

» సర్వే చేసి కలెక్టర్‌కు నివేదిక ఇచ్చిన అధికారులు

» అయినా ప్రైవేటు వ్యక్తులకు ఎకరం రిజిస్ట్రేషన్



రేకులకుంట 466 సర్వేనెంబర్ రిజిస్ట్రేషన్ చేసిన భూమి

కోస్గి, నవంబర్ 12 (ఆంధ్రజ్యోతి) : నారాయణపేట జిల్లా, కోస్గి మండల పరిధిలో ప్రభుత్వ భూముల ఆక్రమణ కొనసాగుతోంది. అందుకు రెవెన్యూ అధికారులు కూడా సహకరించడం విమర్శలకు దారితీస్తోంది. 20 రోజుల క్రితం మండలంలోని బిజ్జారం గ్రామంలో 179 సర్వే నెంబర్‌లోని ప్రభుత్వ భూమిని ప్రైవేటు వ్యక్తులకు కట్టబెట్టేందుకు అధికారులను రికార్డులను సరిచేసేందుకు యత్నించారు. సమాచారం తెలుసుకున్న గ్రామస్థులు కొందరు కలెక్టర్‌కు సమాచారం ఇచ్చారు. దీంతో ఉన్నతాధికారులు ఆరా తీయడంతో ఆ ఫైల్‌ను అధికారులు మూసివేశారు. అలాగే ఇదే మండలంలోని బోలవోనిపల్లి శివారులో, నిషేధిత జాబితాలోని 466-2 సర్వే నెంబర్‌లోని రేకులకుంట శిఖంలో 2.29 ఎకరాల భూమిని అధికారులు ప్రైవేటు వ్యక్తులకు రిజిస్ట్రేషన్ చేశారు. అందుకు పెద్దమొత్తంలో డబ్బు చేతులు మారిందన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

హద్దులు ఏర్పాటు చేసుకుంటాం

రెవెన్యూ అధికారులు గతంలో ఆ భూమిని సర్వే చేసి, హద్దులు నిర్ణయించి నివేదిక ఇచ్చారు. అందుకు అనుగుణంగా మేము హద్దులు ఏర్పాటు చేసుకుంటాం. ఈ విషయంపై గతంలో కలెక్టర్‌కు పూర్తి నివేదిక ఇచ్చాం. మరి తహసీల్దార్ ఎలా రిజిస్ట్రేషన్ చేశారో మాకు తెలియదు.

- ఆనంద్‌కిశోర్, డీఈ ఇరిగేషన్

ఇదీ రేకుల కుంట వ్యవహారం

కోస్గి మండలంలోని బోలవోనిపల్లి శివారులో 1990 లో ఇరిగేషన్ శాఖ 19.35 ఎకరాలను ప్రైవేటు వ్యక్తుల నుంచి చేసి రేకుల కుంటను ఏర్పాటు చేశారు. దీని పరిధిలో సర్వే సర్వే నెంబర్ 463లో 4.36 ఎకరాలు, 464 లో 5.7ఎకరాలు, 465లో 1.16ఎకరాలు, 466లో 2.29 ఎకరాలు, 467లో 5.23 ఎకరాలు, 403లో 4 గుంటల భూమి ఉంది. ఈ కుంటను కొందరు ఆక్రమించి కుంట కట్టను ధ్వంసం చేశారు. ఈ విషయంపై 'ఆంధ్రజ్యోతి' దినపత్రికలో 2024, మార్చి 30న 'ప్రభుత్వ ఆస్తులు ధ్వంసం' శీర్షికన కథనం ప్రచురితం అయ్యింది. దీంతో రెవెన్యూ, ఇరిగేషన్ అధికారులు స్పందించారు. కుంట భూమిని సర్వేచేసి హద్దులు నిర్ణయించి, అదే సంవత్సరం ఆగస్టు 30న కలెక్టర్‌కు నివేదిక ఇచ్చారు. ఈ సర్వే నెంబర్లలోని భూమిని నిషేధిత జాబితాలో ఉంచాలని అందులో పేర్కొన్నారు.

కానీ ఇప్పుడు రెవెన్యూ అధికారులు అందులోని సర్వేనెంబర్ 466లో ఎకరం భూమిని వారం క్రితం ప్రైవేటు వ్యక్తులకు రిజిస్ట్రేషన్ చేశారు. ఈ విషయంపై తహసీల్దార్‌ను వివరణ కోరేందుకు యత్నించగా, ఆయన అందుబాటులోకి రాలేదు.

లారీని ఢీకొన్న బస్సు

» పలువురికి గాయాలు



ప్రమాదంలో పగిలిన బస్సు అద్దాలు

మహబూబ్‌నగర్ రూరల్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి) : ముందు వెళ్తున్న లారీని ఆర్టీసీ బస్సు ఢీకొనడంతో పలువురు గాయపడ్డారు. ఆర్టీసీ మహబూబ్‌నగర్ డిపోకు చెందిన బస్సు బుధవారం మధ్యాహ్నం జిల్లా కేంద్రం నుంచి మక్తల్‌కు వెళ్తుండగా ఈ ప్రమాదం జరిగింది. జయప్రకాష్ ఇంజనీరింగ్ కళాశాల వద్ద ముందు వెళ్తున్న లారీని బస్సు ఢీకొన్నది. ఆ సమయంలో బస్సులో 39 మంది ప్రయాణిస్తుండగా, వారిలో 10 మందికి గాయాలయ్యాయి. అందులో నలుగురికి ఎక్కువ గాయాలు కావడంతో 108 అంబులెన్సులో జిల్లా ఆసుపత్రికి తరలించారు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలాన్ని పరిశీలించి, రోడ్డుకు అడ్డంగా ఉన్న బస్సును పక్కకు తప్పించారు.

గుప్త నిధుల పేరుతో మోసం

» ఇద్దరు మహిళల అరెస్టు, 7.50 లక్షలు స్వాధీనం

» వెల్లడించిన ఎస్పీ గైక్వాడ్ వైభవ్ రఘునాథ్



విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా ఎస్పీ గైక్వాడ్ వైభవ్ రఘునాథ్

నాగర్‌కర్నూల్ క్రైం, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి) : గుప్త నిధుల పేరుతో మోసం చేసిన ఇద్దరు మహిళలను అరెస్టు చేసినట్లు నాగర్‌కర్నూల్ ఎస్పీ గైక్వాడ్ వైభవ్ రఘునాథ్ తెలిపారు. కేసు వివరాలను జిల్లా పోలీసు కార్యాలయంలో బుధవారం ఏర్పాటు విలేకరుల సమావేశంలో వెల్లడించారు. తాడూరు మండలం అంతారం గ్రామానికి చెందిన కోట్ల ఆలివేల మూడేళ్ల క్రితం నాగర్‌కర్నూల్‌కు వచ్చి స్థిరపడింది. పూజల పేరుతో ప్రజలను నమ్మించింది. ఈ క్రమంలో ఆమె దగ్గరకు వచ్చిన వికారాబాద్‌కు చెందిన అత్తిలి అనితతో పరిచయమైంది. ఇద్దరూ కలిసి పూజల పేరుతో ప్రజలను మోసం చేస్తున్నారు. ఇలా బిజినేపల్లి మండలం వడ్డెమాన్ గ్రామానికి చెందిన వేముల శ్రీరామ్‌సాగర్ వద్ద రూ. 4 లక్షలు, నాగర్‌కర్నూల్ మండలంలోని శ్రీపురం గ్రామానికి చెందిన నిరంజన్ వద్ద 2.50లక్షలు తీసుకున్నారు. మీ ఇళ్లల్లో, పొలాల్లో బంగారం ఉందని, వాటిని బయటకు తీస్తే సమస్యలు పరిష్కారం అవుతాయని వారిని నమ్మించారు. పూజ సామగ్రి దుకాణాల్లో కొనుగోలు చేసిన బంగారుపూత నాణేలను పొలంలో పాతిపెట్టి, వెలికి తీస్తున్నట్లు నమ్మించారు. కానీ బాధితులు వారి మోసాన్ని గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో విచారణ చేపట్టిన వారి నుంచి 1,160 బంగారు పూత నాణేలను స్వాధీనం చేసుకున్నారు. వాటిపై ఒక వైపు లక్ష్మీదేవి, మరోవైపు శ్రీచక్రం బొమ్మలు ఉన్నాయి. వాటితో పాటు రెండు ప్యాకెట్ల తాయతులు, ఎర్రటి వస్త్రం కట్టిన కుండ, రూ.7.50 వేల నగదును కూడా స్వాధీనం చేసుకున్నట్లు ఎస్పీ తెలిపారు. విలేకరుల సమావేశంలో ఏఎస్పీ వెంకటేశ్వర్లు, డీఎస్పీ శ్రీనివాస్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

జిల్లాను ప్రథమ స్థానంలో నిలపాలి

» జిల్లా నోడల్ అధికారి నీతూకుమారి ప్రసాద్



వీడియో సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా నోడల్ అధికారి నీతూ కుమారి ప్రసాద్

నాగర్‌కర్నూల్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి) : దేశంలోనే జిల్లాను ప్రథమ స్థానంలో నిలిచేలా అధికారులు కృషి చేయాలని కేంద్ర వ్యవసాయ మంత్రిత్వ శాఖ జాయింట్ సెక్రటరీ, పీఎం డీడీకేవై జిల్లా నోడల్ అధికారి నీతూకుమారి ప్రసాద్ అన్నారు. నాగర్‌కర్నూల్ కలెక్టర్ కార్యాలయంలోని వీడియో కాన్ఫరెన్స్ హాలులో బుధవారం నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. ప్రధానమంత్రి ధన్ ధాన్య కృషి యోజన అమలుకు సమగ్ర కార్యాచరణ ప్రణాళికను రూపొందించాలని అధికారులను ఆదేశించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ పథకాల అమలు వివరాలను తెలుసుకున్నారు. ప్రతీ శాఖ అధికారితో ప్రత్యేక చర్చించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ పథకాలను ప్రైవేట్ రంగాల భాగస్వామ్యంతో అమలు చేసి, రైతులకు లబ్ధి చేకూర్చేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. జిల్లా స్థాయిలో ఏర్పాటు చేసిన సమితి ఆధ్వర్యంలో కలెక్టర్ అధ్యక్షతన క్షేత్రస్థాయిలో సర్వే నిర్వహించాలన్నారు. ప్రతీ మండలంలో ఉత్పాదకత, పంట వైవిధ్యం, నీటి వనరులు, మార్కెట్ సదుపాయాలు, రుణాల లభ్యత, శీతల గిడ్డంగులు తదితరాలను విశ్లేషించాలని సూచించారు. రైతులకు ప్రయోజనం కలిగేలా చర్యలు తీసుకుంటున్న కలెక్టర్ బదావత్ సంతోష్‌ను ప్రత్యేకంగా ప్రశంసించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని 20 మండలాల్లో పంటల సాగు విస్తీర్ణం, పంటల రకాలు, సాగునీటి వనరులు, రైతుల స్థితిగతులను వివరించారు. ప్రత్యేక కార్యాచరణ ప్రణాళికతో పాటు, రైతులకు అవగాహన కార్యక్రమాలు ఏర్పాట్లు చేస్తున్నట్లు చెప్పారు.

సమావేశంలో అదనపు కలెక్ట ర్ పి.అమరేందర్, జిల్లా వ్యవసాయ అధికారి యశ్వంత్‌రావు, మత్స్య శాఖ అధికారి డాక్టర్ రజిని, పశు సంవర్ధక శాఖ అధికారి జ్ఞాన శేఖర్, డీడీ సత్యనారాయణరెడ్డి, నీటిపారుదల శాఖ అధికారి మురళి తదితరులు పాల్గొన్నారు.

వందేళ్లు గుర్తుండేలా శతాబ్ది ఉత్సవాలు

» సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు



సమావేశంలో మాట్లాడుతున్న సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు

కందనూలు, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి) : భారత కమ్యూనిస్టు పార్టీ శతాబ్ది ఉత్సవాలను మరో వందేళ్లు గుర్తుండిపోయేలా ఘనంగా నిర్వహించాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు పిలుపునిచ్చారు. నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలోని సీపీఐ కార్యాలయంలో బుధవారం నిర్వహించిన జిల్లా సమితి సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శతాబ్ది ఉత్సవాల ముగింపు సందర్భంగా వచ్చేనెల 26న ఖమ్మం పట్టణంలో లక్షలాది మందితో బహిరంగ సభ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సభ విజయవంతానికి పార్టీ సభ్యులందరూ శక్తివంచన లేకుండా కృషి చేయాలన్నారు. సమావేశానికి సీపీఐ రాష్ట్ర కంట్రోల్ కమిషన్ సభ్యుడు హెచ్.ఆనంద్‌జీ అధ్యక్షతన వహించారు.

నాగర్‌కర్నూల్ జిల్లా కార్యదర్శి ఎస్ఎండీ ఫయాజ్, మహబూబ్‌నగర్ జిల్లా కార్యదర్శి బాల కిషన్, గద్వాల జిల్లా కార్యదర్శి బి.ఆంజనేయులు, వనపర్తి జిల్లా కార్యదర్శి కే.విజయ, రాములు, నారాయణపేట జిల్లా కార్యదర్శి నరసింహతో పాటు రాష్ట్ర సమితి సభ్యులు, అనుబంధ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

ద్విచక్ర వాహనం, డీసీఎం ఢీకొని యువకుడి దుర్మరణం

» శుభకార్యానికి వెళ్లి వస్తుండగా ప్రమాదం

జడ్చర్ల, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి) : స్నేహితుడి ఇంట్లో శుభకార్యానికి హాజరై ద్విచక్ర వాహనంపై తిరిగి వెళ్తుండగా జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు మృతి చెందాడు. జడ్చర్ల సీఐ కమలాకర్ తెలిపిన వివరాలలా ఉన్నాయి. మహబూబ్‌నగర్ పట్టణంలోని వీరన్నపేట ప్రాంతానికి చెందిన జె. నరేంద్ర మంగళవారం జడ్చర్లలో తన స్నేహితుడి ఇంట్లో శుభకార్యానికి హాజరయ్యాడు. అనంతరం ద్విచక్రవాహనంపై తిరిగి వెళ్తుండగా, రాత్రి 11.30 గంటల సమయంలో నక్కలబండ తండా వద్ద వెనక నుంచి వచ్చిన డీసీఎం ఢీకొట్టింది. సంఘటనలో తీవ్రంగా గాయపడిన నరేంద్రను స్థానికులు జిల్లా జనరల్ ఆసుపత్రికి తరలించారు.

ఆ తర్వాత మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌కు తీసుకెళ్తుండగా మార్గంమధ్యలో మృతి చెందాడు. సంఘటనపై నరేంద్ర బంధువు వెంకటేశ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు నిర్వహిస్తున్నట్లు సీఐ తెలిపారు.

అక్రమంగా మద్యం విక్రయాలు

ఎర్రవల్లి, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి) : జోగుళాంబ గద్వాల జిల్లా, ఎర్రవల్లి మండల పరిధిలోని బీచుపల్లి శివారులో నిర్వహిస్తున్న బెల్టుషాపుపై బుధవారం పోలీసులు దాడి చేశారు. ఇటిక్యాల ఎస్ఐ రవి తెలిపిన వివరాలిలా ఉన్నాయి.. తిమ్మాపురం గ్రామానికి చెందిన వ్యక్తి బెల్ట్‌షాపు నిర్వహిస్తూ, అక్రమంగా మద్యం అమ్ముతున్నట్లు సమాచారం అందడంతో పోలీసులు దాడి చేశారు. రూ.5,544 విలువైన 5.4 లీటర్ల మద్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. యజమానిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

నాణ్యమైన విత్తనం ఎంపిక చేసుకోవాలి

» విస్తరణ శాస్త్రవేత్త డాక్టర్ బి.రాజశేఖర్



రైతులకు అవగాహన కల్పిస్తున్న శాస్త్రవేత్త

తిమ్మాజిపేట, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి) : రైతు నాణ్యమైన విత్తనాన్ని ఎంపిక చేసుకోవాలని కృషి విజ్ఞాన కేంద్రం పాలెం విస్తరణ శాస్త్రవేత్త డాక్టర్ బి.రాజశేఖర్ అన్నారు. మండల పరిధిలోని గొరిటలో వెంకట్‌రెడ్డి అనే రైతు వేసిన వరి పంటలను 'నాణ్యమైన విత్తనం రైతుకు నేస్తం' కార్యక్రమంలో భాగంగా బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా సస్యరక్షణ శాస్త్రవేత్త డాక్టర్ శైలతో కలిసి ఆయన రైతులతో మాట్లాడారు. నాణ్యమైన విత్తనం రైతన్నకు నేస్తం విత్తనాలను గ్రామ గ్రామాన పంపిణీ చేసినట్లు తెలిపారు. విత్తనోత్పత్తి పద్ధతులు చీడపీడల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను యాంత్రీకరణ పద్ధతులను వివరించారు. రైతులు వ్యవసాయ శాస్త్రవేత్తల, వ్యవసాయ అధికారుల సూచనలు, సలహాలు పాటించాలన్నారు. రావేఫ్ విద్యార్థినులు ఝాన్సీరాణి, హిమబిందు, అలేఖ్య, జానకి, ఉషశ్రీ, శిరీష పాల్గొన్నారు.

ఆడపడుచులకు అండగా ప్రభుత్వం

» డీసీసీబీ చైర్మన్ మామిళ్ళపల్లి విష్ణువర్ధన్‌రెడ్డి



లబ్ధిదారులతో ప్రజాప్రతినిధులు నాయకులు

పాన్‌గల్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఆడపడుచులకు అండగా ఉంటోందని డీసీసీబీ చైర్మన్ మామిళ్లపల్లి విష్ణువర్ధన్‌రెడ్డి అన్నారు. వనపర్తి జిల్లా, పాన్‌గల్ మండల కేంద్రంలోని రైతు వేదికలో బుధవారం నిర్వహించిన చెక్కుల పంపిణీ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ గోవర్ధన్‌సాగర్‌తో కలిసి పాల్గొన్నారు. 124 మంది కల్యాణలక్ష్మి, షాదీముబారక్ లబ్ధిదారులకు చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజా ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధిని ఎవరూ ఆపలేరన్నారు. కార్యక్రమంలో జడ్పీటీసీ మాజీ సభ్యుడు రవి, నాయకులు పుల్లారావు, మధుసూదన్‌రెడ్డి, ముంత భాస్కర్, హైమావతి, తహసీల్దార్ సత్యనారాయణరెడ్డి, డీటీ అశోక్, ఆర్ఐ మహేశ్, వెంకటయ్య, వహిద్ పాల్గొన్నారు.

7 క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టివేత



మొగల్‌మడ్కలో పోలీసులు పట్టుకున్న పీడీఎస్ రైస్

దామరగిద్ద, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి) : నారాయణపేట జిల్లా, దామరగిద్ద మండల పరిధిలోని మొగల్‌మడ్క గ్రామంలో అక్రమంగా నిల్వ ఉంచిన రేషన్ బియ్యాన్ని పట్టుకున్నట్లు ఎస్ఐ రాజు తెలిపారు. గ్రామానికి చెందిన గుంత హనుమంతు ఇంటి వద్ద రేషన్ బియ్యం నిల్వ ఉన్నట్లు సమాచారం అందడంతో పోలీసులు తనిఖీ చేసి 7 క్వింటాళ్లు స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

బాలికపై వేధింపులు

» వ్యక్తికి దేహశుద్ధి, పోలీసులకు అప్పగింత

నారాయణపేట, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి) : నారాయణపేట జిల్లా కేంద్రంలోని సరాఫ్‌బజార్ ప్రాంతానికి చెందిన ఓ వ్యక్తి, 9వ తరగతి చదువుతున్న బాలికను కొంతకాలంగా వేధిస్తున్నాడు. ఈ విషయాన్ని కుటుంబ సభ్యులకు చెప్పింది. దీంతో స్థానిక యువకులు బుధవారం సాయంత్రం అతడిని పట్టుకొని దేహశుద్ధి చేసి స్టేషన్‌కు తీసుకెళ్తుండగా, అతడికి సంబంధించిన వారు పోలీసులకు సమాచారం అందించారు. దీంతో పోలీసులు అతడిని అదుపులోకి తీసుకొని స్టేషన్‌కు తరలించారు. విషయం వేర్వేరు వర్గాలకు చెందిన వారికి సంబంధించినది కావడంతో పోలీసులు పరిస్థితి చేయిదాటకుండా చర్యలు తీసుకున్నారు.

క్రైం కార్నర్

కల్వర్టును ఢీకొన్న కారు

» నలుగురికి స్వల్ప గాయాలు

» శ్రీశైలం ఘాట్ రోడ్డులో ఘటన



శ్రీశైలం ఘాట్‌రోడ్డులో ప్రమాదానికి గురై దెబ్బతిన్న కారు

బ్రహ్మగిరి, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి) : శ్రీశైలం ఘాట్‌రోడ్డులో ఓ కారు అదుపుతప్పి కల్వర్టును ఢీకొన్నది. ఈ సంఘటన నాగర్‌కర్నూల్ జిల్లా, అమ్రాబాద్ మండలంలోని వటువర్లపల్లి, బ్రహ్మగిరి మధ్య బుధవారం జరిగింది. బ్రహ్మగిరి ఎస్ఐ జయన్న తెలిపిన వివరాల ప్రకారం... హైదరాబాద్‌లోని ఎల్‌బీ నగర్‌కు చెందిన శ్రీనివాస్‌కుమార్ నలుగురు కుటుంబ సభ్యులతో కలిసి కారులో శ్రీశైలం మల్లన్న దర్శనం కోసం వెళ్తున్నారు. ఘాట్‌రోడ్డులోని రాసమోళ్లబావి ప్రాంతంలో కారు అదుపుతప్పి కల్వర్టును ఢీకొన్నది. ప్రమాదంలో అప్పారావు, వాణి అపర్ణలతో పాటు, చిన్నారి లసైవిలకు స్వల్పగాయాలయ్యాయి. వారిని 108 అంబులెన్సులో వెల్దండలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రి వెళ్లారు. ఎవ్వరికీ ప్రాణాపాయం లేదని ఎస్ఐ తెలిపారు.

బస్సు ఢీకొని గొర్రెల కాపరికి గాయాలు

ఉప్పునుంతల, నవంబరు 12 : (ఆంధ్రజ్యోతి) : ఆర్టీసీ బస్సు ఢీకొని ఓ గొర్రెల కాపరి గాయపడ్డాడు. నాగర్‌కర్నూల్ జిల్లా, ఉప్పునుంతల మండలం పిరట్వాన్‌పల్లి సమీపంలో బుధవారం ఈ సంఘటన జరిగింది. డిండి మండలంలోని బోనగోయినిపల్లి గ్రామానికి చెందిన ముత్తయ్య గొర్రెల మందను తోలుకెళ్తుండగా, పిరట్వాన్‌పల్లి స్టేజీ సమీపంలో హైదరాబాద్ నుంచి శ్రీశైలం వైపు వెళ్తున్న ఆర్టీసీ వరంగల్ డిపో బస్సు వెనకనుంచి ఢీకొన్నది. ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన ముత్తయ్యను 108 అంబులెన్సులో అచ్చంపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

ఎల్లమ్మ ఆలయంలో చోరీ

మక్తల్, నవంబర్ 12 (ఆంధ్రజ్యోతి) : నారాయణపేట జిల్లా, మక్తల్ పట్టణంలోని బసవేశ్వర కాలనీ ఎల్లమ్మ ఆలయంలో మంగళవారం అర్ధరాత్రి చోరీ జరిగింది. గుర్తుతెలియని వ్యక్తులు ఆలయం తాళం విరగ్గొట్టి, అమ్మవారి వెండి కిరీటం, వెండి ఆభరణాలు, వెండి ముఖ కవచాలను ఎత్తుకెళ్లారు. వాటి విలువ రూ.40వేలు ఉంటుందని అర్చకులు తెలిపారు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలాన్ని పరిశీలించారు.



ఆభరణాలు లేకుండా ఉన్న అమ్మవారి విగ్రహం

పట్టపగలు దొంగతనం

» భూత్పూర్ పట్టణంలో ఘటన

భూత్పూర్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి) : మహబూబ్‌నగర్ జిల్లా, భూత్పూర్ పట్టణంలోని ఓ ఇంట్లో బుధవారం పట్టపగలు చోరీ జరిగింది. బాధితుడు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. మండలంలోని మద్దిగట్ల గ్రామానికి చెందిన బాల్‌రెడ్డి మునిసిపాలిటీ 9వ వార్డులోని ఓ ఇంట్లో అద్దెకు ఉంటూ, పక్కనే టీకొట్టు నిర్వహిస్తున్నాడు. ఉదయం 10 గంటల సమయంలో ఇంటికి తాళం వేసి, టీకొట్టుకు వెళ్లాడు. మధ్యాహ్నం భోజనం చేసేందుకు ఇంటికి రాగా, అప్పటికే తాళం పగులగొట్టి ఉంది. లోపలికి వెళ్లి చూడగా, బీరువాలోని రూ.15 వేలు, అరతులం బంగారం చోరీకి గురైనట్లు గుర్తించాడు. వెంటనే పోలీసులకు సమాచారం అందించడంతో ఎస్ఐ చంద్రశేఖర్, క్లూస్ టీం సభ్యులు సంఘటనా స్థలానికి చేరుకొని పరిశీలించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.



భూత్పూర్ పట్టణంలోని చోరీ జరిగిన ఇంట్లో తెరిచి ఉన్న బీరువా

ఇంటి తాళం విరగ్గొట్టి బంగారం, వెండి చోరీ

» నారాయణపేట ఎస్పీ గెస్ట్ హౌస్ పక్కనే సంఘటన

నారాయణపేట టౌన్ నవంబరు 12 (ఆంధ్రజ్యోతి) : నారాయణపేట జిల్లా కేంద్రంలోని ఎస్పీ గెస్ట్‌హౌస్ సమీపంలోని ఓ ఇంట్లో చోరీ జరిగింది. ఇంటి యజమాని కుర్వ నిద్దప్ప కుటుంబం సహా బతుకుదెరువు కోసం హైదరాబాద్‌కు వలస వెళ్లాడు. మంగళవారం ఇంటికి వచ్చిన వారికి తలుపు గడియ విరగ్గొట్టి ఉండటంతో ఆందోళనకు గురై, లోపలికి వెళ్లి పరిశీలించారు. ఇంట్లోని తులం బంగారం, 30 తులాల వెండి, మూడు క్వింటాళ్ళ బియ్యం చోరీకి గురైనట్లు గుర్తించి, పోలీసులకు సమాచారం అందించారు. సంఘటనా స్థలాన్ని పరిశీలించిన పోలీసులు, బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

డ్రంకెన్ డ్రైవ్ కేసులో ఐదుగురికి జైలు శిక్ష

కల్వకుర్తి, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి) : డ్రంకెన్ డ్రైవ్ కేసులో 5గురికి న్యాయాధికారి జైలు శిక్ష విధించినట్లు నాగర్‌కర్నూల్ జిల్లా, కల్వకుర్తి ఎస్ఐ జీ మాధవరెడ్డి తెలిపారు. ఇటీవల నిర్వహించిన డ్రంకెన్ డ్రైవ్ తనిఖీల్లో పట్టుబడిన 5 గురిని బుధవారం కల్వకుర్తి కోర్టులో హాజరు పరిచారు. వారిలో కల్వకుర్తి పట్టణంలోని గాంధీనగర్‌కు చెందిన సయ్యద్ గౌస్‌కు 4 రోజు ల జైలు శిక్ష, రూ.500 జరిమానా, మల్లికార్జున్‌రెడ్డికి 3 రోజుల జైలుశిక్ష, రూ. 600 జరిమానా, తిలక్‌నగర్‌కు చెందిన కడారి మల్లేష్‌కు 2 రోజుల జైలుశిక్ష, రూ. 600 జరిమాన విధిస్తూ న్యాయాధికారి జె.కావ్య తీర్పు వెల్లడించారు. అలాగే కల్వకుర్తి మండలంలోని తిమ్మరాశిపల్లికి చెందిన కోట్ల శివయ్యకు 2 రోజులు జైలు శిక్ష, రూ.100 జరిమానా, కల్వకుర్తికి చెందిన మహ్మద్‌ఖాన్‌కు ఒక రోజు జైలు శిక్ష, రూ. 500 జరిమానా విధించినట్లు ఎస్ఐ తెలిపారు.

మరో వ్యక్తికి మూడు రోజులు..

వెల్దండ, (ఆంధ్రజ్యోతి) : మద్యం తాగి వాహనం నడిపిన వ్యక్తికి బుధవారం కోర్టు జైలుశిక్ష, జరిమానా విధించినట్లు ఎస్ఐ కురుమూర్తి తెలిపారు. వెల్దండ ప్రధాన రహదారిపై వాహనాల తనిఖీ చేస్తుండగా మండల కేంద్రమైన మూసాపేటకు చెందిన మలగోని గంగాధర్‌గౌడ్ మద్యం తాగి వాహనం నడుపుతూ పోలీసులకు పట్టుబడ్డాడు. ఈ మేరకు అతనిపై కేసు నమోదు చేసి కల్వకుర్తి జేఎఫ్‌సీఎం కోర్టులో ప్రవేశపెట్టగా న్యాయాధికారి కావ్య అతడికి మూడు రోజుల సాధారణ జైలు, 600 రూపాయల జరిమానా విధించారని ఎస్ఐ పేర్కొన్నారు.

మద్యం తాగి వాహనం నడుపొద్దు

గద్వాల క్రైం (ఆంధ్రజ్యోతి) : మద్యం తాగి వాహనం నడిపితే కఠిన చర్యలు తీసుకుంటామని గద్వాల పట్టణ ట్రాఫిక్ ఎస్ఐ బాలచంద్రుడు హెచ్చరించారు. జోగుళాంబ గద్వాల జిల్లా కేంద్రంలోని సుంకులమ్మ మెట్టు సమీపంలో బుధవారం సాయంత్రం డ్రంకెన్ డ్రైవ్ తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా మద్యం తాగి వాహనం నడుపుతూ పట్టుబడిన 5 గురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

భగీరథుడు కరుణించేనా?

» ఆరేళ్లుగా కొనసాగుతున్న మిషన్ భగీరథ పనులు

» శిథిలావస్థకు చేరిన పాత పైపులైన్

» కృష్ణానది నుంచి నేరుగా నీటి సరఫరా

» ఇబ్బంది పడుతున్న బ్రహ్మగిరి, కృష్ణగిరి వాసులు



బ్రహ్మగిరిలో అసంపూర్తిగా ఉన్న మిషన్ భగీరథ ఫిల్టర్ హౌస్

బ్రహ్మగిరి, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి) : నాగర్‌కర్నూల్ జిల్లా సరిహద్దులో, కృష్ణానదికి అతిసమీపంలో ఉన్న బ్రహ్మగిరి, కృష్ణగిరి గ్రామాలకు మిషన్ భగీరథ నీరు అందడం లేదు. శ్రీశైలం ప్రాజెక్టు నిర్మాణ సమయంలో ఏర్పడిన ఈ రెండు గ్రామాలకు తాగునీరు అందించేందుకు అప్పట్లో ఏర్పాటు చేసిన పైప్‌లైన్ శిథిలావస్థకు చేరింది. దీంతో వారానికోసారి మాత్రమే తాగునీరు సరఫరా అవుతుండటంతో స్థానికులు ఇబ్బంది పడుతున్నారు.

2020లో పనుల అప్పగింత

బ్రహ్మగిరి, కృష్ణగిరి గ్రామాల్లో ప్రతీ ఇంటికి నల్లాల ద్వారా తాగునీటిని అందించేందుకు మిషన్ భగీరథ పథకం అమలు చేయాలని అప్పటి ప్రభుత్వం నిర్ణయించింది. 2020లో నాబార్డు నిధులు రూ. 6.58 కోట్ల వ్యయంతో చేపట్టేందుకు టెండర్లు పిలిచి, కాంట్రాక్టర్‌కు పనులు అప్పగించింది. కృష్ణానది నుండి బ్రహ్మగిరి వరకు 3.5 కిలోమీటర్ల పైపులైన్ ఏర్పాటు చేసి ఆ రెండు గ్రామాల్లో ఇంటింటికీ నల్లాల ద్వారా తాగునీటిని సరఫరా చేయాల్సి ఉంది. ఒప్పందం ప్రకారం 2023, ఆగస్టు నాటికి పనులు పూర్తి చేయాల్సి ఉంది. కానీ పనులు దక్కించుకున్న కాంట్రాక్టర్లు నాసిరకం పైపులను వేయడంతో ఇప్పటికే జాయింట్లు ఊడిపోయాయి. ఇళ్ల ముందు ఇష్టానుసారంగా పైపులు వేయడంతో, వాటిపై నుంచి కార్లు, బైకులు తిరిగి అవి నలిగిపోయాయి. కొన్ని చోట్ల విరిగిపోయాయి. దీంతో అదనపు నిధులు వెచ్చించి కొత్త పైప్‌లైన్ వేయాల్సి వచ్చింది.

యంత్రాల ఏర్పాటులో జాప్యం

మిషన్ భగీరథ పనుల్లో భాగంగా చేపట్టిన ఫిల్టర్ హౌస్ నిర్మాణం, ఫిల్టర్ బెడ్ పనులు 90 శాతం పూర్తయ్యాయి. కానీ ల్యాబ్‌కు సంబంధించిన యంత్రాలను ఏర్పాటు చేయడంలో జాప్యం జరుగుతోంది. అందుకు మరింత సమయం పడుతుందని అధికారులు చెప్తున్నారు. కాంట్రాక్టర్ పనులను సకాలంలో పూర్తి చేయకపోవడంతో నిధులు వెనుదిరిగాయి. దీంతో మిగిలిన పనులను పూర్తి చేసేందుకు కాంట్రాక్టర్ మరోమారు ఒప్పందం చేసుకున్నారు. ఈ పనులు పూర్తయితే తప్ప ఇంటింటికీ తాగునీరు అందే పరిస్థితి లేదు. ప్రస్తుతం ఆయా గ్రామాలకు కృష్ణానది నీటిని శుద్ధి చేయకుండా నేరుగా సరఫరా చేస్తున్నారు. దీంతో తాము అనారోగ్యం బారిన పడుతున్నామని ప్రజలు వాపోతున్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి పనులను వీలైనంత త్వరగా పూర్తి చేయాలని, ఇంటింటికీ శుద్ధమైన తాగునీటిని సరఫరా చేయాలని కోరుతున్నారు.

త్వరలో పనులు పూర్తి



మిషన్ భగీరథ పనుల్లో కొంత జాప్యం జరగడం వాస్తవమే. ఫిల్టర్ హౌస్, ల్యాబ్‌లకు సంబంధించిన పరికరాల కొనుగోలు కోసం కాంట్రాక్టర్‌కు కొంత సమయం ఇచ్చాం. మరో 4 నెలల్లో పనులను పూర్తి చేసి, ఇంటింటికీ స్వచ్ఛమైన తాగునీటిని సరఫరా చేస్తాం.

- హేమలత, మిషన్ భగీరథ డీఈ

జలవిద్యుత్ ఉత్పత్తి రెండు యూనిట్లకే పరిమితం

ఆత్మకూరు, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి) : ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టుకు ఎగువ నుంచి వరద తగ్గుముఖం పట్టడంతో ఎగువ, దిగువ జల విద్యుత్ కేంద్రాల్లో బుధవారం కేవలం రెండు యూనిట్ల ద్వారా విద్యుత్ ఉత్పత్తి కొనసాగింది. ఎగువ కేంద్రంలో ఒక యూనిట్ ద్వారా 1.617 మిలియన్ యూనిట్లు, దిగువ కేంద్రంలో ఒక యూనిట్ ద్వారా 1.854 మిలియన్ యూనిట్ల విద్యుత్‌ను ఉత్పత్తి చేసినట్లు ఎస్ఈ శ్రీధర్ తెలిపారు. ఇప్పటివరకు ఎగువ కేంద్రంలో 503.314, దిగువ కేంద్రంలో 494.391 మిలియన్ యూనిట్ల విద్యుత్ అయినట్లు పేర్కొన్నారు.

యువతకు ఉచిత శిక్షణ అవకాశం

గద్వాల టౌన్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలోని క్రైస్తవ మైనార్టీ యువతకు సోలార్ ప్యానల్ ఇన్‌స్టాలేషన్ టెక్నీషియన్, ఫ్యాషన్ డిజైనింగ్, టైలరింగ్, బ్యూటీషియన్ కోర్సుల్లో ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు జిల్లా మైనార్టీ సంక్షేమ శాఖ అధికారి నుశిత బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. గద్వాల, అయిజ మునిసిపాలిటీల్లో మూడు నెలల పాటు శిక్షణ ఉంటుందన్నారు. దరఖాస్తుదారులు క్రైస్తవ/ రోమన్/ క్యాథలిక్/ ఆంగ్లో ఇండియన్ మతానికి చెంది బీసీ-సీ సర్టిఫికెట్ కలిగి ఉండాలన్నారు. 18-45 సంవత్సరాల వయస్సు గల అభ్యర్థుల కుటుంబ వార్షిక ఆదాయం, గ్రామీణ ప్రాంతాల్లో రూ.1.50 లక్షలు, మునిసిపాలిటీ పరిధిలో రూ.2లక్షలు ఉండాలన్నారు. దరఖాస్తుకు ఆధార్‌కార్డు తప్పనిసరిగా ఉండాలని, ఎంపిక చేసుకున్న కోర్సు ప్రకారం కనీస విద్యార్హత కలిగి ఉండాలన్నారు.

కల్యాణమస్తు

» ఈనెల 16న సామూహిక వివాహాలు

» వేదిక కానున్న అచ్చంపేట పట్టణం

» చురుగ్గా సాగుతున్న ఏర్పాట్లు

» హాజరుకానున్న రాష్ట్ర మంత్రులు



సామూహిక వివాహాల కోసం అచ్చంపేటలో సిద్ధమవుతున్న కల్యాణ మండపం

అచ్చంపేట, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి) : బాజాభజంత్రీలు ఘనంగా మోగనున్నాయి. వేద మంత్రాలు మారుమోగనున్నాయి.. 60 కొత్త జంటలు పెళ్లి పుస్తకానికి శ్రీకారం చుట్టనున్నాయి. అందుకు నాగర్‌కర్నూల్ జిల్లా అచ్చంపేట పట్టణం వేదిక కానున్నది. పట్టణానికి చెందిన గోపిశెట్టి శివ ఈ శుభకార్యాన్ని సంకల్పించారు. ఈనెల 16న నిర్వహించనున్న సామూహిక వివాహాలకు ఏర్పాట్లు చురుగ్గా సాగుతున్నాయి. వేడుకలకు ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కతో పాటు, జిల్లా మంత్రులు, ఎమ్మెల్సీ విజయశాంతి హాజరు కానున్నట్లు ఆయన తెలిపారు. కొత్త జంటలకు మంగళసూత్రంతో పాటు, వివాహదుస్తులు, బీరువా, ఇంటి సామానులను ఉచితంగా అందించనున్నట్లు చెప్పారు. దాదాపు 10 వేల మందికి పైగా బంధు మిత్రులు, ప్రజలు హాజరుకానున్నారని, అందుకు అనుగుణంగా పట్టణంలోని ఆర్‌కే ఫంక్షన్‌హాల్ వద్ద ఏర్పాట్లు చురుగ్గా కొనసాగుతున్నాయని తెలిపారు. వేడుకల సందర్భంగా హల్దీఫంక్షన్‌తో పాటు ప్రముఖ కళాకారుల సాంస్కృతిక ప్రదర్శనలు ఏర్పాటు చేయనున్నారు. పట్టణం మొత్తం విద్యుత్‌దీపాలను ఏర్పాటు చేశారు.

తల్లిదండ్రుల స్ఫూర్తితో శుభకార్యం



నా చిన్నప్పుడు మా తల్లిదండ్రులు గోపిశెట్టి సర్వేశ్వరప్ప, ప్రభులీల ఎవరైనా పేదలు పెళ్లి చేసుకుంటుంటే మంగళసూత్రం, మెట్టెలు అందించేవారు. అదే స్ఫూర్తితో సామూహిక వివాహాలు చేయాలని నిర్ణయించుకున్నాం. ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ సహకారం తో ఏర్పాట్లు చేస్తున్నాం. ఇప్పటికే శుభలేఖలు అందించి ఆహ్వానించాం.

- గోపిశెట్టి శివ, కౌన్సిలర్, అచ్చంపేట

రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీలకు విద్యార్థిని శిరీష

» ఉమ్మడి జిల్లా స్థాయిలో ప్రథమ స్థానం



రాష్ట్రస్థాయి పరుగు పందెం పోటీలకు ఎంపికైన విద్యార్థిని పి.శిరీషకు ప్రశంసాపత్రం అందిస్తున్న ఉపాధ్యాయులు

బిజినేపల్లి, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి) : నాగర్‌కర్నూల్ జిల్లా, బిజినేపల్లి మండలంలోని నందివడ్డెమాన్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల 10వ తరగతి విద్యార్థిని పి.శిరీష రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్ పోటీలకు ఎంపికయ్యింది. పాలమూరు పట్టణంలో నిర్వహించిన ఉమ్మడి జిల్లా స్థాయి అథ్లెటిక్స్ పరుగు పందెం పోటీలు, 8 వందల మీటర్ల విభాగంలో ఆమె మొదటి స్థానంలో నిలిచి, రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైంది. ఈ సందర్భంగా బుధవారం పాఠశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు మురళీమోహనాచార్యులు, పీఈటీ లక్ష్మీపతి, ఉపాధ్యాయులు హనుమంత్ రెడ్డి, చంద్రమోహన్ రెడ్డి, నాగిరెడ్డి అభినందించారు.

భక్తిశ్రద్ధలతో అమ్మవారికి అభిషేకం

» గట్టులో ముగిసిన అంబాభవానీ ఉత్సవాలు



గట్టులో భవానీ మాత పల్లకి ఊరేగింపులో పాల్గొన్న భక్తులు

గట్టు, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి) : జోగుళాంబ గద్వాల జిల్లా, గట్టు మండల కేంద్రంలో ఈనెల 8వ తేదీన పందిరి పూజతో ప్రారంభమైన అంబాభవానీ ఉత్సవాలు మంగళవారం రాత్రి ముగిశాయి. ఈ సందర్భంగా అమ్మవారికి భక్తిశ్రద్ధలతో అభిషేకం చేసి, పల్లకీ సేవ నిర్వహించారు. ఉత్సవాలు విజయవంతమైన సందర్భంగా అందుకు సహకరించిన వారందరికీ ఆలయ కమిటీ సభ్యులు ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎస్‌కే సమాజ్ అధ్యక్షుడు కేపీ అంబుసా, పీ వెంకటేశ్, ఎస్పీ వీరన్న, ఊటారం గోవిందు, లక్ష్మీనారాయణ, చంద్రమోహన్, మల్లికార్జున్, ఎస్ఎస్‌కే సమాజ్ యూత్ సభ్యులు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాల సాధన మన హక్కు

» ఈ నెల 20న చేనేత మహాధర్నా

» చేనేత కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు శాంతికుమార్



చేనేత రుణమాఫీ ర్యాలీని ప్రారంభిస్తున్న చేనేత కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వనం శాంతికుమార్

రాజోలి, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి) : సంక్షేమ పథకాల సాధనకు కలిసికట్టుగా పోరాడాలని, అది కార్మికుల హక్కు అని చేనేత కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వనం శాంతికుమార్ అన్నారు. జోగుళాంబ గద్వాల జిల్లా, రాజోలిలో చేనేత సహకార సంఘం అధ్యక్షుడు దోత్రి శ్రీనివాసులు ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించిన చేనేత రుణమాఫీ మహా ర్యాలీకి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు. ప్రజాసంఘాల నాయకులు, చేనేత కార్మికులు రాజోలి చేనేత సహకార సంఘం నుంచి తహసీల్దార్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించి, అక్కడ ఆందోళన చేపట్టారు. అనంతరం తహసీల్దార్ రామ్మోహన్‌కు వినతి పత్రం ఇచ్చారు. ఆ తర్వాత గ్రామంలోని మహాత్మా గాంధీ, డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహాలకు నూలు మాలలు వేసి నివాళి అర్పించారు. అనంతరం కన్యకాపరమేశ్వరి ఆలయం ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన సభకు హాజరయ్యారు. ఈ సందర్భంగా శాంతికుమార్ మాట్లాడుతూ చేనేత కార్మికులకు రుణమాఫీ చేస్తామని కాంగ్రెస్ ప్రభుత్వం హామీ ఇచ్చి సంవత్సరం గడిచినా అమలు చేయడం లేదని విమర్శించారు. అందుకు నిరసనగా ఈ నెల 20న హైదరాబాద్‌లోని చేనేత, జౌళి శాఖ కమిషనర్ కార్యాలయం వద్ద మహాధర్నా నిర్వహించనున్నట్లు తెలిపారు. చేనేత కార్మికులు అధిక సంఖ్యలో హాజరై ధర్నాను జయప్రదం చేయాలని కోరారు. చేనేత కార్మికసంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్సీ సీతారాములు మాట్లాడుతూ ప్రభుత్వాలు మారుతున్నాయి కానీ చేనేత కార్మికుల బతుకులు మారడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో కార్మిక సంఘం కార్యదర్శి నరహరి, రాజోలి చేనేత సహకార సంఘం అధ్యక్షుడు డి.శ్రీనివాసులు, ఉపాధ్యక్షుడు మాబు, రాజోలి కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు దస్తగిరి, సీపీఎం నాయకులు, చేనేత కార్మికులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి ఖోఖో పోటీల్లో మక్తల్ విద్యార్థినుల ప్రతిభ



ఖోఖో పోటీల్లో కాంస్య పథకం సాధించిన విద్యార్థులు

మక్తల్, నవంబర్ 12 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రస్థాయి ఖోఖో చాంపియన్‌షిప్ పోటీల్లో నారాయణపేట జిల్లా, మక్తల్ మండలంలోని కర్ని ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థినులు సత్తాచాటారు. పెద్దపల్లి జిల్లా కేంద్రంలో ఈ నెల 6 నుంచి 10వ తేదీ వరకు నిర్వహించిన రాష్ట్రస్థాయి ఖోఖో పోటీల్లో పాఠశాల విద్యార్థినులు శశిరేఖ, రోషిణి ఉమ్మడి జిల్లా జట్టు తరపున ఆడి సత్తా చాటినట్లు పీడీ రూప తెలిపారు. బాలుర జట్టులో అరవింద్ పాల్గొని 5వ స్థానంలో నిలిచినట్లు చెప్పారు. ప్రధానోపాధ్యాయుడు వెంకటయ్యగౌడ్, విలియమ్స్ ఉపాధ్యాయులు వారిని అభినందించారు.

చదువుతో పాటు క్రీడల్లో రాణించాలి

» ఎస్‌జీఎఫ్ జిల్లా కార్యదర్శి శారదాబాయి

» ఉమ్మడి జిల్లా చెస్, ఖోఖో, అథ్లెటిక్స్ జట్ల ఎంపిక



అథ్లెటిక్స్ పోటీలను ప్రారంభిస్తున్న ఎస్‌జీఎఫ్ సెక్రటరీ శారదాబాయి

మహబూబ్‌నగర్ స్పోర్ట్స్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో రాణించాలని ఎస్‌జీఎఫ్ జిల్లా కార్యదర్శి శారదాబాయి అన్నారు. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో బుధవారం మహబూబ్‌నగర్ ప్రధాన స్టేడియంలో ఉమ్మడి జిల్లా అండర్-14, 17, 19 అథ్లెటిక్స్, ఖోఖో జట్లను ఎంపిక చేశారు. లిటిల్ స్కాలర్స్ పాఠశాలలో అండర్-14, 17, 19 చెస్ జట్లను ఎంపిక చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ త్వరలో జరుగనున్న రాష్ట్రస్థాయి పోటీల్లో ప్రతిభ చాటి, జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక కావాలని ఆకాంక్షించారు. పోటీలకు దాదాపు 600 మంది క్రీడాకారులు హాజరయ్యారు. కార్యక్రమంలో వ్యాయామ ఉపాధ్యాయులు దూమర్ల నిరంజన్, వేణుగోపాల్, రమణ, మొగులాల్, ఆనంద్‌కుమార్, మోయిన్, రాజు, శ్రీను పాల్గొన్నారు.



ఖోఖో ఆడుతున్న క్రీడాకారులు

న్యూస్‌బాక్స్..

పాఠశాలకు మైక్‌సెట్ వితరణ

జడ్చర్ల, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని నసరుల్లాబాద్ తండా ప్రాథమిక పాఠశాలకు అదే తండాకు చెందిన అగ్గి రాముడు మైక్‌సెట్, ఆంప్లిఫైర్, మౌత్‌పీస్‌ను బుధవారం ఎంఈవో మంజూలాదేవి సమక్షంలో హెచ్‌ఎం బాబునాయుడుకు అందజేశారు. స్కూల్ కాంప్లెక్స్ హెచ్‌ఎం అనంతప్ప, ఉపాధ్యాయుడు నరేశ్‌గౌడ్, తండావాసులు రాజేష్, మల్లేష్, రంజిత్, రాజు, సురేందర్, రేఖ్యానాయక్ పాల్గొన్నారు.

రెవెన్యూ మేళాకు మూడు దరఖాస్తులు

భూత్పూర్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి) : మునిసిపాలిటీలోని ప్రజలు ఇళ్ల, ఆస్తీ పన్నులు, భవనాల కొలతల వ్యత్యాసాల సమస్యలపై మునిసిపాలిటీ ఆధ్వర్యంలో మంగళ, బుధవారాల్లో రెవెన్యూ మేళా కార్యక్రమాన్ని మునిసిపల్ అధికారులు ప్రారంభించారు. ఇందులో భాగంగా బుధవారం మూడు దరఖాస్తులు వచ్చినట్లు మునిసిపాలిటీ మేనేజర్ నర్సింహులు తెలిపారు. మునిసిపాలిటీ ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

నాణ్యమైన భోజనం అందించాలి

జడ్చర్ల, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని మునిసిపల్ కమిషనర్ లక్ష్మారెడ్డి నిర్వాహకులకు సూచించారు. బుధవారం మండలంలో దేవునిగుట్టతండాకు వెళ్లే దారిలో ఉన్న కేజీబీవీతో పాటు పట్టణంలోని గిరిజన బాలుర వసతి గృహాన్ని సందర్శించారు. పారిశుధ్యం, పరిశుభ్రత, విద్యార్థులకు అందిస్తున్న భోజనం నాణ్యతను పరిశీలించారు.

సైబర్ నేరాలపై అవగాహన అవసరం

బాలానగర్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి) : సైబర్ నేరాలపై ప్రతీ ఒక్కరు అవగాహన కలిగి ఉండాలని ఎస్‌ఐ లెనిన్‌గౌడ్ పేర్కొన్నారు. మండలంలోని పెద్దరేవల్లి గ్రామంలో ఎస్‌ఐ ఆధ్వర్యంలో గ్రామస్థులకు ట్రాఫిక్ నియంత్రణ నిబంధలు, మత్తు పదార్థాలు, మాదకద్రవ్యాల వినియోగంపై అవగాహన కల్పించారు. సైబర్ మోసానికి గురైతే ఫిర్యాదు చేయాలని అన్నారు.

కొనసాగిన ధాన్యం విక్రయాలు

దేవరకద్ర, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి) : దేవరకద్ర మార్కెట్‌లో బుధవావారం ధాన్యం క్రయ విక్రయాలు కొనసాగాయి. పెద్ద హంస 99 క్వింటాళ్లు విక్రయానికి రాగా, క్వింటాలుకు ధర గరిష్ఠంగా రూ.1759, కనిష్ఠంగా రూ.1,754 పలకగా, ఆర్‌ఎస్‌ఆర్ 1491 క్వింటాళ్లు రాగా, గరిష్ఠంగా రూ.2,293, కనిష్ఠంగా రూ.2,091 పలికినట్లు మార్కెట్ అధికారి జయశ్రీ తెలిపారు.

నేడు ఆర్టీసీ విశ్రాంత ఉద్యోగుల వైద్య శిబిరం

మహబూబ్‌నగర్ టౌన్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి) : ఆర్టీసీ విశ్రాంత ఉద్యోగుల కోసం స్థానిక ఎస్వీఎస్ వైద్య కళాశాల నిర్వాహకులు గురువారం వైద్య శిబిరం ఏర్పాటు చేస్తున్నట్లు ఆర్టీసీ రిటైర్డ్ ఎంప్లాయీస్ ఫోరం అధ్యక్షుడు రాజసింహుడు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు నిర్వహించే ఈ శిబిరంలో కార్డియాలజీ, న్యూరాలజిస్ట్, నెఫ్రాలజిస్ట్, ఎండోక్రినాలజిస్ట్, మధుమేహం వ్యాధిగ్రస్తులకు సంబంధిత డాక్టర్లతో సలహాలు పొందాలన్నారు.

రాష్ట్రస్థాయి ఫుట్‌బాల్ పోటీలకు విద్యార్థుల ఎంపిక

జడ్చర్ల, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి) : ఈనెల 14 నుంచి 16వ తేదీ వరకు నల్గొండ జిల్లాలో జరిగే 69వ రాష్ట్ర స్థాయి ఫుట్‌బాల్ పోటీలకు బాదేపల్లి బాలుర జడ్పీహెచ్‌ఎస్ విద్యార్థులు ఎంపికయ్యారు. ఈనెల 3న వనపర్తి జిల్లాలో జరిగిన ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా అండర్-17 విభాగంలో ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయికి ఎంపికైనట్లు హెచ్‌ఎం చంద్రకళ తెలిపారు. ఎంపికైన సునీత, అనూష, ఆర్తి, వర్ష, నిఖితను బుధవారం అభినందించారు. పీడీలు రాంకల్యాణ్‌జీ, వెడన్న, ఉపాధ్యాయులు గోపాల్, సునీల్, శంకర్, యుగంధర్ ఉన్నారు.

రైతులకు కనీస సౌకర్యాలు కల్పించాలి

జడ్చర్ల, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి) : బాదేపల్లి వ్యవసాయ మార్కెట్‌కు ధాన్యం విక్రయాలకు వచ్చిన రైతులకు కనీస సౌకర్యాలు కల్పించాలని బీజేపీ కిసాన్ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎంబీ బాలకృష్ణ కోరారు. బుధవారం బాదేపల్లి వ్యవసాయ మార్కెట్‌లో రైతులు ఎదుర్కొంటున్న సమస్యలు తెలుసుకున్నారు. రైతులకు తాగునీరు సౌకర్యం కల్పించాలని కోరారు. అల్పాహారం, భోజనం వసతి అసలే లేదని ఆవేదన వ్యక్తం చేశారు. మార్కెట్ ఆవరణలో విద్యుత్ దీపాలు ఏర్పాటు చేయాలని, రాత్రి వేళలో వెలిగే విధంగా చూడాలని మార్కెట్ కార్యదర్శి అశ్వక్‌అహ్మద్‌ను కోరారు. ముఖ్యంగా మార్కెట్ ఆవరణ చెత్తా చెదారంతో నిండి ఉందని, శుభ్రం చేయించాలని కోరారు.

మాదాసి కురువలకు సర్టిఫికెట్లు నిరంతర ప్రక్రియ

పాలమూరు, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి) : మాదాసి, మాదారి కురువలకు ఎస్సీ కుల సర్టిఫికెట్స్ ఇవ్వటమనేది నిరంతర ప్రక్రియగా తెలంగాణ మాదాసి/మాదారి కురువ ఎస్సీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు మొగులయ్య తెలిపారు. బుధవారం కలెక్టరేట్‌లో ఆర్డీవోను కలిసి వినతిపత్రం అందజేశారు. గోపాల్, ఆంజనేయులు, వెంకట్రాములు, వెంకటేష్, కృష్ణ, ఎర్రవాపు నరసింహులు, శివరాజు, మల్లేష్, నరేందర్, తిరుపతి, రవి, పర్వతాలు, అంజిలయ్య పాల్గొన్నారు.

చెక్కు చెదరని..

చారిత్రక కొలనులు

» వేసవిలో కూడా తగ్గని నీరు » కాకతీయుల కాలం నుంచి గుర్తింపు



శ్రీరామకొండలో వనమూళికల కోనేరు



ఖిల్లాలో రాణి స్నాన కొలను

కోయిలకొండ, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి) : కాకతీయుల కాలంలో అలనాడు నిర్మించిన కొలనులు నేటికీ చెక్కు చెదరకుండా ఉనికిని చాటుతున్నాయి. ఎత్తైన కొండలలో రాతి బండల మధ్య నిర్మించిన తాగునీటి, స్నానపు కొలనులు ఎల్లప్పుడూ నీటితో జలకళను సంతరించుకొంటున్నాయి. కోయిలకొండ ఖిల్లాతో పాటు శ్రీరామకొండ, వీరభద్రస్వామి ఆలయంలో రాజుల కాలంలో కొలనులు నిర్మించారు. కోయిలకొండ ఖిల్లా కట్టడాల్లో నీటి కొలనులకు ప్రత్యేకత ఉంది. బండ రాళ్లను తొలచి చుట్టూ రాతి ప్రహరీతో నిర్మాణాలు చేపట్టారు. రాజు, రాణి స్నానం చేయుటకు వేరు వేరు కొలనులు ఉన్నాయి. శ్రీరామకొండలో స్నానపు, తాగునీరు కోనేరులు వేసవిలోనూ భక్తులతో పాటు మూగ జీవాలకు తాగునీరు అందిస్తున్నాయి. తామర పువ్వులు, ఆకుల మధ్య ఎప్పుడు నీరు చల్లగా ఉంటుంది. ఖిల్లా, శ్రీరామకొండతో పాటు అంతకు ఎత్తైన కొండ వీరభద్రస్వామి ఆలయం వెనుక గతంలో నిర్మించిన కొలను ఇప్పటికీ చెక్కుచెదరకుండా ఉంది.

జనరల్ ఆసుపత్రిలో..

కాన్పు చేసుకుంటే వైఎస్సార్ కిట్

» ఈనెల 14నుంచి అమలు » నియోజకవర్గంలో ఎమ్మెల్యే నిధులతో అమలు



ఆశాలకు యూనిఫామ్ పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే యెన్నం

మహబూబ్‌నగర్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి) : తన నియోజకవర్గానికి చెందిన గర్భిణులు జనరల్ ఆసుపత్రిలో కాన్పులు చేయించుకునే వారికి వైఎస్సార్ (యెన్నం శ్రీనివాస్‌రెడ్డి) కిట్‌లను అందజేస్తానని ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి స్పష్టం చేశారు. సొంత నిధులతో ఈనెల 14న బాలల దినోత్సవం సందర్భంగా ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టనున్నట్లు తెలిపారు. బుధవారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఆశా వర్కర్లకు యూనిఫామ్ పంపిణీ చేసి, మాట్లాడారు. నియోజకవర్గంలోని గర్భిణులు ప్రభుత్వ ఆసుపత్రిలో ప్రసవమైన వారి వివరాలు క్యాంపు కార్యాలయంలో అందజేస్తే వారికి కిట్‌లను అందజేస్తామని వివరించారు. పిల్లలకు పౌష్టికాహారం అందించేందుకు ఆశాలు తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలన్నారు. సమాజానికి సేవ చేసే ఆశాలకు ఏటా ప్రభుత్వం రెండు జతల యూనిఫాం (చీరలు) ఇస్తుందని, ఈ కార్యక్రమాన్ని మొదటిసారి ఇక్కడే నిర్వహించుకోవడం సంతోషంగా ఉందన్నారు. ప్రభుత్వం దృష్టికి ఆశాల డిమాండ్‌లను తీసుకెళ్లి నెరవేర్చేందుకు తనవంతు కృషి చేస్తానన్నారు. గ్రంథాలయ సంస్థ చైర్మన్ మల్లు నరసింహారెడ్డి, నాయకులు సిరాజ్‌ఖాద్రి, శ్రీనివాస్, రాములుయాదవ్, అంజద్, అశ్వక్, శ్రీనివాసులు పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యం అమ్మాలి

పాలమూరు : రైతులు కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యం అమ్మాలని ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. బుధవారం మార్కెట్ యార్డులో మెప్మా (మహిళా సంఘం) ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాన్ని ఎమ్మెల్యే, మార్కెట్ కమిటీ చైర్మన్ బెక్కరి అనితతో కలిసి ప్రారంభించారు. మార్కెట్ యార్డు అభివృద్ధికి ప్రభుత్వం రూ.1.24 కోట్లు మంజూరు చేసిందని, త్వరలోనే కొత్త షెడ్లు, ఇతర అభివృద్ధి పనులు ప్రారంభిస్తామన్నారు. జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మల్లు నరసింహారెడ్డి, డీసీసీ ప్రధాన కార్యదర్శి సిరాజ్‌ఖాద్రి, డీఎంవో బాలమణి తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల ఇన్‌స్పెక్షన్ వందశాతం పూర్తి



వీసీలో పాల్గొన్న డీపీవో నిఖిల శ్రీ, జడ్పీ సీఈవో వెంకట్‌రెడ్డి

» డీపీవో భాగం నిఖిల శ్రీ

మహబూబ్‌నగర్ న్యూటౌన్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలోని అన్ని గ్రామాల్లో అధికారులు వందశాతం తనిఖీలు పూర్తి చేశారని జిల్లా పంచాయతీ అధికారి భాగం నిఖిల శ్రీ అన్నారు. బుధవారం కలెక్టరేట్‌లోని వీసీ హాల్‌లో పంచాయతీ రాజ్ కమిషనరేట్ నుంచి పంచాయతీ రాజ్ డైరెక్టర్ సృజన నిర్వహించిన వీసీలో జడ్పీ సీఈవో వెంకట్‌రెడ్డి, డీఆర్డీవో నర్సింహులుతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జిల్లాలోని 16 మండలాలకు గాను 14 మండలాల్లో ఎంపీఈవోలు, పంచాయతీ కార్యదర్శులు తనిఖీలు పూర్తి చేశారని, మిడ్జిల్, సీసీకుంట మండలాల్లో త్వరలో పూర్తి చేస్తారని తెలిపారు. కురుమూర్తి జాతర నేపథ్యంలో అధికారులు జాతర విధుల్లో ఉన్నందున తనిఖీలు పూర్తి చేయలేదన్నారు. డీఎస్ఆర్ యాప్‌లో ప్రతీ పంచాయతీ కార్యదర్శి ఉదయం 11 గంటలలోగా వివరాలు నమోదు చేస్తున్నారన్నారు. ఉపాధి హామీ పథకంలో ఇంకుడు గుంతలతో పాటు, సామూహిక శానిటరి కాంప్లెక్స్‌ల నిర్మాణం చేపడుతున్నట్లు డీఆర్డీవో నర్సింహులు తెలిపారు. జడ్పీ సీఈవో వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ జిల్లాకు ప్లాస్టిక్ వేస్ట్ మేనేజ్‌మెంట్ మంజూరైందని, దాని నిర్మాణ పనులు సంబంధిత ఎంపీడీవోలు చేపడుతున్నారన్నారు. గ్రామాల్లో అవసరం మేరకు పశువుల పాకలు నిర్మిస్తున్నామన్నారు. సమావేశంలో సీసీలు రవికుమార్, ఖాజా పయాజోద్దీన్ పాల్గొన్నారు.

గుడ్లు వచ్చాయి

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

హన్వాడ, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి) : బుధవారం నాణ్యత లేని గుడ్లు.. మూడు రోజులుగా గర్భిణులు, బాలింతలు అనే శీర్షికన ఆంధ్రజ్యోతి దిన పత్రికలో ప్రచురితమైన కథనానికి ఐసీడీఎస్ అధికారులు స్పందించారు. మండలంలోని కొన్ని అంగన్‌వాడీ కేంద్రాలకు గురువారం గుడ్లు సరాఫరా ఏజెన్సీ మంచి గుడ్లను సరఫరా చేశారు. హన్వాడ, నాయినోనిపల్లి, కొనగట్టుపల్లి గ్రామాల్లోని అంగన్‌వాడీ కేంద్రాల్లో కుళ్లిన గుడ్లను వెనక్కి తీసుకొని మంచి గుడ్లు పంపిణీ చేశారు.

ధాన్యం కొనుగోలు ప్రారంభించిన అధికారులు

భూత్పూర్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి) : ప్రారంభించారు.. వదిలేశారు అంటూ ఈనెల 11న ఆంధ్రజ్యోతి దిన పత్రికలో ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. బుధవారం మండలంలోని అన్నీ కేంద్రాల్లో ధాన్యం కొనుగోలును ప్రారంభించారు.

స్పీకర్ గడ్డం ప్రసాద్‌కు ఘన స్వాగతం



స్పీకర్‌కు స్వాగతం పలుకుతున్న కలెక్టర్ విజయేందిర బోయి, తహసీల్దార్

భూత్పూర్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి) : అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ బుధవారం చిన్న చింతకుంట మండలం కురుమూర్తి ఆలయానికి వెళ్తుండగా, భూత్పూర్ వద్ద కలెక్టర్ విజయేందిర బోయి, తహసీల్దార్ కిషన్ బొకే అందించి స్వాగతం పలికారు.

ప్రశంసాపత్రం అందుకున్న పీఆర్వో



డీజీపీ చేత ప్రశంసాపత్రం అందుకుంటున్న పీఆర్వో శ్రీనివాసులు

మహబూబ్‌నగర్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి) : మూడు రోజుల పాటు హైదరాబాద్‌లో రాష్ట్రంలోని అన్ని జిల్లాల పోలీస్ పీఆర్వోలకు ప్రత్యేక శిక్షణ ఇచ్చారు. బుధవారం ముగింపు కార్యక్రమానికి హాజరైన డీజీపీ శివధర్‌రెడ్డి శిక్షణ పూర్తి చేసుకున్న పీఆర్వోలకు ప్రశంసా పత్రాలు అందజేయగా, మహబూబ్‌నగర్ పీఆర్వోలకు శ్రీనివాసులు డీజీపీ చేత ప్రశంసాపత్రం అందుకున్నారు.

విద్యార్థులకు ప్రశంసా పత్రాలు

హన్వాడ, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని శారదా విద్యాలయంలో బుధవారం ఆర్ఎస్ఎస్ నాయకులు జిల్లా విభాగం గోసేవా ప్రముఖ గురూజీ రఘోత్తం ఆర్య, శేరి వెంకటయ్య విద్యార్థులకు ప్రశంసా పత్రాలు అందించారు. ఇటీవల రాష్ట్ర, జిల్లా స్థాయిలో నిర్వహించిన గోవిజ్ఞాన పరీక్షలో మండలానికి చెందిన 14 మంది విద్యార్థులు ప్రతిభ కనబర్చారు. వారికి ప్రశంసా పత్రాలు అందజేశారు.

పైసలిస్తేనే పనులు

» గండీడ్ తహసీల్దార్ కార్యాలయంలో సిబ్బంది ఇష్టారాజ్యం



సిబ్బందిపై తహసీల్దార్‌కు ఫిర్యాదు చేస్తున్న గ్రామ కమిటీ సభ్యులు

గండీడ్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి) : గండీడ్ తహసీల్దార్ కార్యాలయం అవినీతికి చిరునామాగా మారిందని, పైసలిస్తేనే పనులు జరుగుతున్నాయని, లేకపోతే సంబంధిత ఫైలుకు కొర్రీలు పెడుతూ నెలల తరబడి తిప్పుకుంటున్నారని గండీడ్ గ్రామ అభివృద్ధి కమిటీ సభ్యులు పేర్కొన్నారు. బుధవారం తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ మల్లికార్జునరావును నిలదీసారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కుల, ఆదాయ ధ్రువపత్రాలకు రూ.250 నుంచి రూ.500 వరకు, రేషన్‌కార్డులో పేర్లను ఎక్కించాలన్నా.. తొలగించాలన్నా.. ధరణిలో రిజిస్ట్రేషన్లు చేసుకోవాలన్నా రూ.2 వేల నుంచి రూ.3 వేలు ఇవ్వాలని అటెండర్ నుంచి పైస్థాయి సిబ్బంది వరకు ప్రజలను వేధిస్తున్నారని తహసీల్దార్‌కు తెలిపారు. ఈ విషయమై తహసీల్దార్‌ను ఆంధ్రజ్యోతి వివరణ కోరగా ఈ విషయం ఇంత వరకు తన దృష్టికి రాలేదని ఎవరైనా డబ్బులు తీసుకుంటే చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో గ్రామ కమిటీ అధ్యక్షుడు కేశవులు, ఉపాధ్యక్షుడు సురేందర్‌గౌడ్, సెక్రటరీ బాబ్రీ, సహాయ కార్యదర్శులు శ్రీనివాస్‌గౌడ్, రాఘవేంద్రచారి, రాజు, మధు, నరేష్, గంగయ్య, శ్రీనివాస్, రాములు, మైపాల్‌గౌడ్, రఘు తదితరులు ఉన్నారు.

క్రీడలతో స్నేహభావం పెంపొందుతుంది



విజేత, రన్నర్ జట్లుతో డాక్టర్ మధుసూదన్‌రెడ్డి

మహబూబ్‌నగర్ స్పోర్ట్స్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి) : క్రీడలతో స్నేహభావం పెంపొందుతుందని సుశ్రుత ప్రజావైద్యశాల ఎండీ డాక్టర్ మధుసూదన్‌రెడ్డి అన్నారు. ఎస్ఎఫ్ఐ, డీవైఎఫ్ఐ ఆధ్వర్యంలో బాలురు కళాశాల మైదానంలో నిర్వహిస్తున్న క్రికెట్ టోర్నీ ముగింపు కార్యక్రమానికి ఆయన హాజరై బహుమతులు ప్రదానం చేశారు. క్రీడలను ప్రోత్సాహించాలనే ఉద్దేశంతో ఎస్ఎఫ్ఐ, డీవైఎఫ్ఐ ఆధ్వర్యంలో క్రికెట్ పోటీలు నిర్వహించడంతో నిర్వాహకులను అభినందించారు. టోర్నీలో విజేతగా పారా మెడికల్ కళాశాల, రన్నర్‌గా శ్రద్ధ జూనియర్ కళాశాల నిలిచాయి. డీవైఎఫ్ఐ కన్వీనర్ ప్రశాంత్, ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యాక్షుడు నందు, నాయకులు ఈశ్వర్, శివ, సాయి, శివ పాల్గొన్నారు.

క్రీడాకారుడి సన్మానం

నేషనల్ క్రికెట్ లీగ్ (ఎన్‌సీఎల్)కు ఎంపికైన జిల్లా కేంద్రానికి చెందిన షేక్ ఫర్హాన్‌ను బుధవారం క్రిష్టియన్‌పల్లిలోని బ్రదర్ హండ్ అకాడమీ ఘనంగా సన్మానించారు. అకాడమీ చైర్మన్ షేక్ వజహత్‌అలీ మాట్లాడుతూ చిన్న వయస్సు నుంచి క్రికెట్‌లో రాణించడం అభినందనీయం అన్నారు. కోచ్‌లు రియాజుద్దీన్, ముబ్షర్, నవాజ్, క్రీడాకారుడి తండ్రి షేక్ ఫరీదుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

భరోసా కేంద్రానికి ఏడాది



కేక్ కట్ చేస్తున్న ఎస్పీ జానకి

మహబూబ్‌నగర్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి) : పాలమూరులో బాలికలు, మహిళల భద్రత కోసం భరోసా కేంద్రం ఏర్పాటు చేసి బుధవారానికి సరిగ్గా ఏడాది కావడంతో ఎస్పీ జానకి, లీగల్ సర్వీసెస్ అథారిటీ చైర్‌పర్సన్, న్యాయాధికారి ఇందిరతో కలిసి కేంద్రంలో కేక్ కట్ చేసి సంబురాలు చేసుకున్నారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ గతేడాది నవంబరు 12న భరోసా కేంద్రం ఏర్పాటు చేసుకున్నామని, ఏడాదిగా విజయవంతంగా నడుస్తుందని చెప్పారు. ఈ ఏడాదిలో ఎంతోమంది బాధితులకు అండగా నిలబడి, వారికి భరోసా కల్పించడంతోపాటు న్యాయం చేశామన్నారు. 163 కేసులు భరోసా కేంద్రానికి అందాయని చెప్పారు. సీడబ్ల్యూసీ భాగస్వామ్యంతో కౌన్సెలింగ్‌లు నిర్వహించామని తెలిపారు. అందులో 117 పోక్సో కేసులు, 24 రేప్ కేసులు, 22 ఇతర కేసులు ఉన్నాయన్నారు. 218 కౌన్సెలింగ్‌లు నిర్వహించామని, డీడబ్ల్యూఓ సహకారంతో 45 మంది బాధితులకు రూ.11.25 లక్షల పరిహారం అందజేయడం జరిగిందని పేర్కొన్నారు. లీగల్ సర్వీసెస్ అథారిటీ చైర్ పర్సన్ ఇందిర మాట్లాడుతూ భరోసా కేంద్రం ద్వారా ఏడాది కాలంలో మహిళలు, బాలికలకు న్యాయం అందించడంలో విశేషంగా కృషిచేయడం జరిగిందన్నారు. అంతకుముందు హోంగార్డుగా 21 ఏళ్ల పాటు సేవలందించి ఉద్యోగ విరమణ పొందిన లక్ష్మయ్యను ఎస్పీ జిల్లా పోలీసు కార్యాలయంలో సన్మానించి, జ్ఞాపికను అందజేశారు. అడిషినల్ ఎస్పీ ఎన్‌బి రత్నం, డీఎస్పీలు వెంకటేశ్వర్లు, రమణారెడ్డి, సీడబ్ల్యూసీ నయీముద్దీన్, డిసిపిఓ నర్మద, భరోసా ఎస్సై అరుణ, కోఆర్డినేటర్ అనిత తదితరులు పాల్గొన్నారు.

● దేవరకద్ర : సమాజంలో పోలీసుల వ్యవస్థపై ప్రజలకు నమ్మకం పెరగలని ఎస్పీ జానకి పేర్కొన్నారు. బుధవారం మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్‌ను తనిఖీ చేసి, స్టేషన్ పరిసరాలు, రికార్డులు, కేసుల రిజిస్టర్, ఎఫ్ఐఆర్‌ను పరిశీలించారు. ఎస్ఐ నాగన్న పాల్గొన్నారు.

ఘనంగా సదర్ ఉత్సవాలు



దున్నపోతులతో సదర్ ఉత్సవాల్లో పాల్గొన్న యాదవులు

పాలమూరు, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి) : సదర్ ఉత్సవాలను బుధవారం జిల్లా కేంద్రంలోని గడియారం చౌరస్తాలో ఘనంగా నిర్వహించారు. అఖిలభారత యాదవ మహాసభ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ ఉత్సవాలకు టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఏపీ మిథున్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. మొదటగా శ్రీకృష్ణుడి విగ్రహానికి పూలమాల వేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ ఐక్యతతోనే యాదవులు అభివృద్ధి చెందాలని ఆశాభావం వ్యక్తం చేశారు. రాబోవు డీలిమిటేషన్‌లో రాష్ట్రంలో 34 ఎమ్మెల్యే సీట్లు పెరిగే అవకాశం ఉందని, అందులో బీసీలకు కేటాయించాలని ఆశాభావం వ్యక్తం చేశారు. కాగా ప్రతీ ఏడాది రాజకీయ పార్టీలకతీతంగా నిర్వహించే సదర్ ఉత్సవాలను ఈ ఏడాది కాంగ్రెస్ పార్టీ ఉత్సవాలుగా నిర్వహించారని బీజేపీ, బీఆర్ఎస్ శ్రేణులు ఆవేదన వ్యక్తం చేశారు. ఎంపీ డీకే అరుణను సదర్ ఉత్సవాలకు పిలవకపోవటంతో సదర్ ఉత్సవాలను బహిష్కరిస్తున్నట్లు బీజేపీ శ్రేణులు శ్రీశైలం, నారాయణ, ప్రవీణ్‌యాదవ్ బాహటంగానే ప్రకటించారు. బీఆర్ఎస్ నాయకులను పిలవకపోవటం బీఆర్ఎస్ శ్రేణులు సదర్ ఉత్సవాలను బహిష్కరించారు. కార్యక్రమంలో సదర్ ఉత్సవ కమిటీ అధ్యక్షుడు నరసింహులు యాదవ్, ముడా చైర్మన్ లక్ష్మణ్‌యాదవ్, మునిసిపల్ మాజీ చైర్మన్ ఆనంద్‌గౌడ్, సాయిలుయాదవ్, చందు, శాంతయ్య, చందు, రమేష్, ప్రవీణ్, శివకుమార్, యాదవులు, తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు విస్తరణకు భూములు ఇవ్వలేం



తహసీల్దార్ కిషన్‌కు వినతిపత్రం ఇస్తున్న రైతులు

భూత్పూర్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి) : 44వ జాతీయ రహదారిని కలుపుకొని మండలంలోని అన్నాసాగర్ మీదుగా రాయిచూరు రోడ్డుకు వెళ్తున్న భారత్ మాల రోడ్డు విస్తరణకు మా భూములు ఇవ్వలేమని రైతులు బుధవారం తహసీల్దార్‌కు విన్నవించారు. మండలంలోని అన్నాసాగర్ గ్రామ శివారు మీదుగా భారత్ మాల జాతీయ రహదారి రోడ్డు రాయిచూరుకు వెళ్తుంది. అయితే ఈ రోడ్డు మా భూముల మీదుగా వెళ్తుందని, మాకు ఎలాంటి సమాచారం ఇవ్వకుండా దాదాపు 62 ఎకరాల భూమిని భారత్ మాల రోడ్డుకు ప్రభుత్వం కేటాయిస్తున్నట్లు తెలిసిందని అన్నాసాగర్ గ్రామ రైతులు తహసీల్దార్ కిషన్‌కు వినతిపత్రం అందించారు. మేము నిరుపేద కుటుంబాలకు చెందిన రైతులమని, మాకు ఎకరం, అర ఎకరం పొలాలు ఉండగా, వ్యవసాయాన్ని నమ్ముకొని బతుకుతున్నామని మొర పెట్టుకున్నారు. స్పందించిన తహసీల్దార్ మీ సమస్యను జిల్లా స్థాయి అధికారుల దృష్టికి తీసుకెళ్తానని హామీ ఇచ్చారు. రైతులు ఖాజా, సాబేర్‌పాషా, చంద్రశేఖర్, శంకర్, కృష్ణయ్య, జాంగీర్, మునీర్‌బేగం, షాకీర్‌బేగం, బాలస్వామి, బురాన్, కురువ తిరుపతమ్మ పాల్గొన్నారు.

ఆయిల్‌పామ్ సాగుతో అధిక దిగుబడి

మహబూబ్‌నగర్ రూరల్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి) : ఆయిల్ పామ్ సాగుతో రైతులు అధిక రాబడి పొందవచ్చని జిల్లా ఉద్యాన పట్టు పరిశ్రమ శాఖాధికారి వేణుగోపాల్ అన్నారు. గురువారం మహబూబ్‌నగర్ రూరల్ మండలం కోడూర్ రైతు వే దికలో ప్యాక్స్ పీపీసీఎస్ పరిధిలో ఆయిల్‌పామ్ సాగుపై రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆయిల్‌పామ్ సాగులో పద్ధతులు పాటించి మంచి లాభాలు పొందవచ్చునని పేర్కొన్నారు. సబ్సిడీతో మొక్కలు, డ్రిప్ ఇవ్వడం తో పాటు నాలుగు సంవత్సరాలు ఎకరాకు రూ.4,200 ఇవ్వనున్నట్లు తెలిపారు. మండల ఉద్యాన అధికారి స్వప్న, ఏఈవో నాగరాజు, ప్యాక్స్ సిబ్బంది లక్ష్మన్, రాజు, రామాంజనేయులు, ప్రీ యూనిక్ కంపెనీ ప్రతి నిధులు గోపాల్ పాల్గొన్నారు.

చెకుముకి సైన్స్ టాలెంట్ టెస్ట్

మిడ్జిల్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ఏడు ఉన్నత పాఠశాలల్లో చెకుముకి సైన్స్ సంబరాలు-2025లో భాగంగా బుధవారం పాఠశాల స్థాయి చెకుముకి సైన్స్ టాలెంట్ టెస్ట్‌ను మండల కేంద్రంలోని జెడ్పీహెచ్‌ఎస్ పాఠశాల ఆవరణలో నిర్వహించారు. జెడ్పీహెచ్‌ఎస్ మిడ్జిల్, బోయిన్‌పల్లి, అయ్యవారిపల్లి, వస్పుల, కేజీవీబీ, సెయింట్ మేరీ, చైతన్య భారతి హైస్కూల్ లో 8వ, 9వ, 10వ తరగతి విద్యార్థులు పాల్గొన్నారు. కార్యక్రమాన్ని ఎంఈవో సరస్వతి ప్రారంభించారు. పాఠశాల స్థాయిలో ప్రథమ స్థానం సాధించిన విద్యార్థులు నవంబరు 21న జరిగే మండల స్థాయి టెస్ట్‌లో పాల్గొంటారని తెలిపారు. టీఎస్‌యూటీఎఫ్ మండల అధ్యక్షుడు వెంకటయ్య, జిల్లా ఉపాధ్యక్షుడు నర్సింహులు, ఇన్‌చార్జి హెచ్‌ఎం కృష్ణకుమార్, టీఎస్‌యూటీఎఫ్ ప్రధాన కార్యదర్శి రమేష్ పాల్గొన్నారు.

సేవా కార్యక్రమాల్లో వాసవీ క్లబ్ ముందుంటుంది



ఫ్లడ్‌లైట్‌ను ప్రారంభిస్తున్న వాసవీ క్లబ్ సభ్యులు

జడ్చర్ల, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి) : సామాజిక సేవా కార్యక్రమాల్లో వాసవీక్లబ్ ముందుంటుందని వాసవీ క్లబ్స్ ఇంటర్నేషనల్ ప్రెసిడెంట్ ఇరుకుల్ల రామకృష్ణ అన్నారు. బుధవారం పట్టణంలో జడ్చర్ల వాసవీక్లబ్ ఆధ్వర్యంలో పలు సేవా కార్యక్రమాలు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వాసవీ క్లబ్ ఆధ్వర్యంలో గుడ్‌విల్ విజిట్ కార్యక్రమంలో పాల్గొనడం సంతోషంగా ఉందన్నారు. అనంతరం పట్టణంలోని సత్యేశ్వర ఆశ్రమంలో మానసిక దివ్యాంగులకు దుప్పట్లు పంపిణీ చేశారు. సత్యనారాయణస్వామి ఆలయం ప్రాంగణంలో ఫ్లడ్ లైట్‌లను ప్రారంభించారు. గంగాపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంకు హైడ్రాలిక్ బెడ్ చైర్స్ అందజేశారు. జడ్చర్ల ఏరియా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న ఇన్‌పేషెంట్‌లకు ప్రతీ సోమవారం అందించే అల్పాహారం ప్రారంభించారు. గంగాపురం సమీపంలోని మలయాళస్వామి ఆశ్రమంలో 50 కుర్చీలను అందచేశారు. వాసవీ క్లబ్ సభ్యులు రామకృష్ణ, జ్యోతి, మేడిశెట్టి రామకృష్ణ, మిడిదొడ్డి రాధాకృష్ణ, ఆనంద్‌రాజ్, కందె కృష్ణ, మంచన గణేష్, ప్రవీణ్, సత్యనారాయణశెట్టి, రమేశ్, దేవరాజు, నవీన్, శ్రీలక్ష్మీ, వసుధ పాల్గొన్నారు.